మన నవతెలంగాణ
ఖానాపూర్
నియోజకవర్గం ప్రత్యేక సంచిక
నిర్మల్ | 8 పేజీలు | సోమవారం 21 ఆగస్టు 2023

గిరిజనులకే కిరీటం..!

- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ వరకు సాగిన ప్రస్థానం
- నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు
- నాలుగు సార్లు టీడీపీ..హ్యాట్రిక్ సాధించిన కాంగ్రెస్, టీఆర్ఎస్
- ఖానాపూర్ నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారిన రాజకీయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం గమనార్హం. జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఈ నియోజకవర్గం నిర్మల్ జిల్లాలో ఉన్నా.. దీని పరిధిలోని కొన్ని మండలాలు మాత్రం ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఉండటం విశేషం. జన్నారం మండలం మంచిర్యాల జిల్లా పరిధిలోకి రాగా.. ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు మాత్రం ఆదిలాబాద్ జిల్లాలోకి వస్తాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాలు రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఈ నియోజకవర్గం ఒక్కటే మూడు జిల్లాల పరిధిలో ఉంది. గిరిజనులకు రిజర్వ్ చేయబడిన ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు తొలి నుంచి ఆసక్తికరంగా మారుతున్నాయి. ఆదిలో హస్తం పార్టీ మూడు సార్లు గెలుపొంది హవా కొనసాగించగా .. మారిన పరిణామాలతో తెలుగుదేశం పార్టీ నాలుగు సార్లు సత్తాచాటింది. తాజాగా టీఆర్ఎస్ పార్టీ మూడు సార్లు ఈ నియోజకవర్గంలో పాగా వేసింది. ప్రస్తుతం టీడీపీ పూర్వవైభవాన్ని కోల్పోగా.. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు బీజేపీ పార్టీలు రానున్న ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నాయి.



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఆదివాసీ, లంబాడా, ఇతర సామాజిక వర్గాల జనాభా కలిగి ఉన్న ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. వీటిలో ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన 1978లో ఏర్పడిన ఖానాపూర్ నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వ్ చేయబడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా రేఖానాయక్ కొనసాగుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11సార్లు అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించగా.. కాంగ్రెస్ పార్టీ 3 సార్లు, టీడీపీ నుంచి 4 సార్లు, టీఆర్ఎస్ నుంచి 3 సార్లు అభ్యర్థులు గెలిచారు. ఒకసారి మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. 1978లో మొట్టమొదటి సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా లంబాడ సామాజిక వర్గానికి చెందిన అంబాజీ జాదవ్ గెలిచారు. 1983 లో రెండవసారి కూడా ఆయన అదే పార్టీ నుంచి విజయం సాధించారు. 1985లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఆజ్మీరా గోవింద్ నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తన ప్రత్యర్థి జాలం సింగ్‌పై గెలిచారు. 1989 ఎన్నికల్లో గోండ్ సామాజిక వర్గానికి చెందిన కోట్నాక్ భీంరావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గోవింద్ నాయక్‌ను ఓడించారు. ఆ పర్యాయం కోట్నాక్ భీంరావ్‌కు గిరిజన శాఖ మంత్రిగా కూడా అవకాశం లభించింది. నియోజకవర్గం నుంచి మంత్రిగా పనిచేసిన ఘనత ఇప్పటి వరకు ఆయనకు మాత్రమే దక్కింది. మరోపక్క 1994లో టీడీపీ నుంచి పోటీచేసిన గోవింద్‌నాయక్ తన ప్రత్యర్థి కోట్నాక్ భీంరావ్‌ను ఓడించి రెండవసారి ఎమ్మెల్యేగా కొనసాగారు. 1999లో టీడీపీ నుంచి పోటీ చేసిన రాథోడ్ రమేష్ తన ప్రత్యర్థి బక్షీనాయక్‌ను ఓడించి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం ▶ మిగతా..4లో...

కనువిందు చేస్తున్న కవ్వాల్ అందాలు

- పచ్చదనం పరుచుకున్న ప్రకృతి వనం
- ఆహ్లాదాన్ని అందిస్తున్న అటవీ ప్రాంతం
- పర్యాటకులకు అందుబాటులో హరిత రిసార్ట్

కవ్వాల్ అటవీ ప్రాంతం కనువిందు చేస్తోంది. అభయారణ్యంలో పచ్చని వాతావరణం, గంతులేసే దుప్పులు, జింకలు, నెమల్లు, పక్షులు, కిలకిల రావాలు, గలగల పారే సెలయేళ్లు, వాగులు వంకల అందాలను తిలకించేందుకు పర్యాటకుల సందడి పెరుగుతోంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఓపెన్ జీపులతో జంగల్ సపారి, వాహనాలలో అడవిలోకి వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు అభయారాణ్యాలలో ప్రముఖమైనది కవ్వాల్ అటవీ ప్రాంతంపై ప్రత్యేక కథనం..



నవతెలంగాణ-జన్నారం

పర్యాటకులను కనువిందు చేసే ఈ అభయారణ్యం మంచిర్యాల, నిర్మల్ రెవెన్యూ డివిజన్ల మధ్య విస్తరించి ఉంది. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని జన్నారంలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందులో వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకులకు వన్యప్రాణులు కనువిందు చేస్తాయి. జన్నారంలోని వన్యప్రాణి సంరక్షణ విభాగంలో దుప్పులు, జింకపిల్లలు, నెమళ్లు, నీల్గాయిలు ఉంచడంతో వీటి సందర్శన కోసం వందలాదిమంది పర్యాటకులు ఈ కేంద్రానికి వచ్చి ప్రకతి అందాలతో పాటు వన్యపాణుల మధ్య గడుపుతూ ఆహ్లాదం పొందుతారు. సెలవు దినాల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా, ఉండి వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తుంటారు.

టైగర్ జోన్‌లో అతిథిగృహాలు

జింకల పునరావాస కేంద్రంతో పాటు ఇక్కడి అభయారణ్యంలో పర్యాటకులు బసా చేసేందుకు అతిథి గృహం ఉంది. ఈ అతిథి గృహంలో వెదురుతో తయారుచేసిన వివిధ రకాల వస్తువులు ఉన్నాయి. వీటితోపాటు ఇక్కడి అభయ అరణ్యంలో ఔషధ మొక్కల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పచ్చదనం పరవశిస్తూ ఎత్తైన వృక్షాలతో ఈ అరణ్యం దర్శనమిస్తూ పర్యాటకులను ఇట్టే కట్టిపడేస్తుంది. ఇక్కడ కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో చెంగుచెంగున ఎగిరే జింకలు, పురివిప్పి నాట్యం చేసే నేమల్లను చూడవచ్చు. దీంతో పర్యాటక శాఖ ప్రత్యేక చర్యలు తీసుకొని పర్యాటకులు బస చేసేందుకు వీలుగా, 2.38 కోట్ల వ్యయంతో హోటల్ విడిది గదులను నిర్మించింది. ఇందులో తొమ్మిది ఏసీ కాటేజీలు, రెండు నాన్ ఏసీ కాటేజీలు, 10 డార్మెంటరీ గదులు, ఒక ఏసీ రెస్టారెంట్ చుట్టూ అందమైన పూల మొక్కలతో ఎంతో అందంగా ఉంటుంది.



పర్యాటకులకు అందుబాటులో ఉన్న జంగల్ సఫారి వాహనం

ఆన్‌లైన్‌లో బుకింగ్ ఇలా చేసుకోవాలి

కవ్వాల్ అభయ అరణ్యానికి పర్యాటకుల తాకిడి రోజు రోజుకు పెరుగుతుంది. ఇందుకు తగ్గట్టుగా పర్యాటక శాఖ సౌకర్యాలు కల్పిస్తుంది. జన్నారం, కడెం మండలాల్లో టూరిజం శాఖ కాటేజీలను నిర్మించింది. జన్నారంలో 9 ఏసి రెండు నాన్ ఏసీ హాళ్లు, చిన్నచిన్న శుభకార్యాలను వినియోగించుకోవడానికి డార్మెంటరీ హాల్లతో రెస్టారెంట్ నిర్మించింది. కడెం మండలంలో 12 ఏసి రెండు నాన్ ఎసి గదులు టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్మించి పర్యాటకులకు అందుబాటులో ఉంచారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతుండడంతో పర్యాటకులు ముందుగా ఆన్‌లైన్ ద్వారా గదులను బుకింగ్ చేసుకునేందుకు వీలు కల్పించింది. డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు.టీఎస్ పీడీసీ.ఇన్‌కు లాగిన్ అయి ఎంచుకోవాలి. ఇక్కడ ఏసీ గదులకు రూ.1654 నాన్ ఏసీకి రూ.వేయి అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

టైగర్ జోన్‌లో వందకు పైగా మూగ జీవాలు

జన్నారం మండల కేంద్రం నుంచి లక్షటిపేట వైపు వెళ్లే దారిలో అర కిలోమీటర్ దూరంలో ఈ జింకల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రంలో ప్రస్తుతం 65 దుప్పులు 14 సాంబార్లు 12 నీల్‌గాయలు ఉన్నాయి. వాటికి అటవీశాఖ సిబ్బంది ప్రతిరోజూ ఉదయం మధ్యాహ్నం ఆహారం అందిస్తారు. వాటి కోసం హైదరాబాదు నుంచి ప్రత్యేకమైన ఆహార ధాన్యాలు తీసుకొస్తారు. అదేవిధంగా సమీపంలో ఉన్న చెట్ల ఆకులు వేస్తారు. ఎక్కడో అడవిలో ఉండే వన్యప్రాణులు, చెంగుచెంగున ఎగిరే దుప్పులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

టైగర్ జోన్‌కు చేరుకునే మార్గాలు

అదిలాబాద్ నుంచి మంచిర్యాల, పట్టణమునకు, మంచిర్యాల నుంచి ఆదిలాబాద్ నిర్మల్ పట్టణానికి వెళ్లేవారు ఇక్కడ సేద తీరవచ్చు. పక్కనే అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన నర్సరీలలో సేద తీరి భోజనాలు చేసే సౌకర్యాలు ఉన్నాయి. ఇక్కడికి రావడానికి అదిలాబాద్ నుంచి 100 కిలోమీటర్లు మంచిర్యాల నుంచి 60 కిలోమీటర్లు నిర్మల్ నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక్కడికి వచ్చేందుకు మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్ పట్టణాల నుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ప్రయివేట్ వాహనాలు ద్వారా కూడా రావచ్చు హైదరాబాద్ నుంచి 250 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో అందరూ చూసేందుకు వీలుగా ఉంటుంది. పర్యాటకులకు బస చేసేందుకు సౌకర్యంతమైన రిసార్ట్స్, అధ్యయన కేంద్రంలో ఆకట్టుకునే బొమ్మలు కూడా ఉన్నాయి.

కవ్వాల్ శ్యాంశూరి ఏర్పాటు

భారీ కీకారణ్యం కావడంతో జన్నారం అటవీ డివిజన్లను కలుపుకొని ప్రత్యేకంగా కవ్వాల్ శ్యాంశూరి డివిజన్ నూతనంగా ఏర్పాటు చేశారు. ఇది 1965లో ఏర్పడింది. అనంతరం దీని పరిధిలో నాలుగు అటవీ క్షేత్రాలను గుర్తించారు. ఇందంన్‌పల్లి, తాళ్లపేట, బీర్సాయిపేట జన్నారంలో ఈ అటవీ క్షేత్రాలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు పులులు సంచరించే ప్రాంతం కావడంతో ఈ అభయారాన్యంలో ఉన్న 24 చదరపు కిలోమీటర్ల దూరం గుర్తించారు. ఇక్కడ అడవుల్లో నాణ్యమైన టేకుమద్య, తుమ్మ వెదురు వంటి విలువైన అటవీ సంపద ఉంది.

పర్యాటక శాఖ ప్రత్యేక సౌకర్యాలు

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు హరిత రిసార్ట్ కాటేజీలు నిర్మించి పర్యాటకులు బస చేసేందుకు సౌకర్యాలు కల్పించారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు జంగిల్ సఫారీ ద్వారా సుమారు 30 కిలోమీటర్ల దూరం అడవిలో ప్రయాణించవచ్చు. అడవిలో ఉదయం పూట ఆరు గంటల లోపు వెళితే వన్యప్రాణుల పరుగులు, పక్షుల కిలకిల రావాలు వినిపిస్తాయి. దట్టమైన అడవిలో పచ్చని చెట్ల మధ్య ప్రయాణం ఇక్కడ వన్యప్రాణుల పరుగులు ఆహ్లాదాన్ని నింపుతాయి. దట్టమైన అడవి ప్రాంతంలో మల్యాల అడవుల్లో అటవీ శాఖ నిర్మించిన వాచ్ టవర్ ఎక్కి పరిశీలిస్తే, చుట్టు దట్టమైన అడవులు కనిపిస్తాయి. అదేవిధంగా పలుమార్లు అడవుల్లో సంచరించే పెద్దపులి పర్యాటకులను కనిపిస్తుంది.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఆఫీసొద్దీన్, ఇన్‌ఛార్జి ఎఫ్‌ఆర్‌ఓ జన్నారం



జన్నారంలోని కవ్వాల్ అభయారన్యంలో అన్నానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఉదయం జంగిల్ సఫారీ ద్వారా అడవిలోకి తీసుకెళ్లి అన్ని ప్రాంతాలను చూపిస్తున్నాం. పెరుగుతున్న రద్దీ దృశ్య ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునవలసి ఉంటుంది. రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం వీకెండ్‌లో తాకిడి ఎక్కువగా ఉంటుంది.

ఆస్తులు పెంచుకున్నారు.. అభివృద్ధి మరిచారు..

- కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పుర్క బాపురావు



నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గంలో ఒకే వర్గానికి చెందిన వారే గత దశాబ్దాలుగా పరిపాలించారు. అయినా అభివృద్ధి చేశారంటే అది లేదు. కేవలం ఆస్తులు పెంచుకున్నారే తప్ప అభివృద్ధిని మరిచారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు పుర్క బాపురావు అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. దీంతో గిరిజన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని అన్నారు. గిరిజనులకు సకాలంలో వైద్యం అందక అనేక మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికి కరెంట్ లేని గిరిజన గ్రామాలు ఎన్నో ఉన్నాయని, చీకటి పడుతుందంటే భయం భయంగా గడుపుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయం చేసేందుకు ఇప్పటి వరకు త్రిఫేజ్ కరెంట్ సౌకర్యం కూడా లేదని తెలిపారు. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపోర్లితే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండే గ్రామాలు కోకోల్లాలుగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సందర్భంలో అనారోగ్యం బారిన పడితే మృతి చెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా ఇంద్రవెల్లి, ఉట్నూర్ పట్టణ కేంద్రాల్లో రోడ్డు విస్తరణ, ఇరువైపుల డ్రైయినేజీలు లేవని, వర్షపు నీరంతా రోడ్డు మీద పారుతుందని పేర్కొన్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి పట్టణంలో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో జనాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమయంలో ప్రజాప్రతినిధులు వచ్చి పరామర్శించి, హామీలు ఇచ్చారే తప్ప ఇప్పటి వరకు పరిష్కారం దిశగా అడుగులు వేయలేదని అన్నారు. గిరిజన విద్యకు పీజీ కాలేజ్, ఉన్నత విద్య కోసం ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ, డీఈడీ కళాశాల పున:ప్రారంభం, బీఈడీ కళాశాలలో పూర్తి స్థాయి అధ్యాపకుల నియామకం లాంటి సమస్యలను వెక్కిరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇవన్నీ పాలక ప్రభుత్వాలకు కనబడడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్నో ఏండ్లుగా అభివృద్ధి చేస్తూ వస్తున్నమంటున్న వారు ఎక్కడ అభివృద్ధి జరిగిందో తెలియజేయాలని ప్రశ్నించారు. జనాలకు సేవ చేసేందుకు పార్టీ, ప్రజలు అవకాశం కల్పిస్తే పైన పేర్కొన్న సమస్యలతో పాటుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా..

- బీఆర్ఎస్ నాయకులు భూక్యా జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఖానాపూర్

రాజకీయ వ్యాపారాన్ని తరిమికొట్టి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని బీఆర్ఎస్ నాయుకులు భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. గత తొమ్మిదేండ్లు నియోజకవర్గ స్థాయిలో అనుకున్న అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో రోడ్లు, తాగు నీరు, పక్కా ఇండ్లు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని అన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిస్థాయిలో చేపడతానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, మైనార్టీ, బీసీలకు ఆర్థిక చేయూత బృహత్తర పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే జన్నారంను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఖానాపూర్ డివిజన్‌కు కృషి చేస్తానన్నారు. ఖానాపూర్ పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తాను సొంతంగా అశ్రో ట్రస్టును ఏర్పాటు చేశానని, ఈ ట్రస్టు ద్వారా నిరుపేద విద్యార్థులకు విద్యా, వైద్యం, అనాధ పిల్లలకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తున్నానని వెల్లడించారు. అంతే కాకుండా స్థానికంగా ఉండి ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతానని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గిరిజన సంక్షేమానికే ఐటీడీఏ ఏర్పాటు

● సంక్షేమ పథకాలతో అభివృద్ధికి బాసట ● ప్రతియేటా కోట్లాది రూపాయల నిధులు విడుదల ● విద్యా, వైద్యం, సంక్షేమం, ఉపాధి రంగాలకు పెద్దపీట



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఉట్నూర్ కేంద్రంగా 1975లో ఐటీడీఏ (సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి గిరిజనులు అనేక రంగాల్లో రాణించేందుకు ఐటీడీఏ కృషి చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ ప్రాంతం మొత్తం 6138 చదరపు కిలో మీటర్లలో విస్తరించి ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం గిరిజనుల జనాభా 4లక్షల 95వేల 794 ఉంది. అందులో గోండులు 2లక్షల 63వేల 515 మంది, లంబాడాలు 1లక్ష 12వేల 793 మంది, ప్రధాన్‌లు 26వేల 29 మంది, నాయక్‌పోడ్‌లు 5వేల 206, ఎరుకలు 1,735, కోయ, ఇతరులు 30వేల 739, కొలాం 38వేల176, తోటి 2వేల231, మన్నేవార్ 15వేల 370 మంది ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 షెడ్యూల్డ్ మండలాలు, 27 పాక్షిక షెడ్యూల్డ్ మండలాలు ఉన్నాయి.

అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు

చుట్టూ కొండలు, కోనల మధ్య ఉండే జీవనం, గిరిజనులకు విద్య అంటే తెలియని రోజులవి. గిరిజనులు భూమి.. భుక్తి.. విముక్తి కోసం కుమురం భీం ఉద్యమాలు చేసిన మన్యంలో గిరిజనులకు విద్యను అందించాలని ఐటీడీఏ కృషి చేస్తోంది. షెడ్యూల్డ్ ప్రాంతంలో 123 అశ్రమ పాఠశాలలను, గురుకుల జూనియర్ కళాశాలలు, గురుకులం ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మినీ గురుకులం, బీఈడీ కళాశాల, గిరిజన డిగ్రీ కళాశాలు, గిరిజన మోడల్ పాలిటెక్నిక్ కళాశాలలను నెలకొల్పి గిరిజన విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో, కళాశాలల్లో వేల మంది గిరిజన విద్యార్థులను చేర్పించింది. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నారు. గిరిజనులు ఇంగ్లీష్ మీడియంలో రాణించేందుకు దిశ, ప్రథమ్, కరడి పాత్, మాతృభాష బోధనలతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యాభివృద్ధి ఆదర్శ క్రీడా పాఠశాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కంప్యూటర్ ద్వారా విద్యాబోధన చేస్తున్నారు.

వైద్యానికి ప్రాధాన్యత

గిరిజనులు సీజనల్ కాలాలతో మలేరియా, అతిసారం, జ్వరాలతో అనేక మంది మృత్యువాత పడుతున్న సందర్భంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు మెరుగైన వైద్యానికి తగు చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉట్నూర్ కేంద్రంగా జిల్లా ఆస్పత్రి, 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 186 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి నిత్యం గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించింది. గిరిజనులకు రాత్రీ పగలు అనే తేడా లేకుండా నిరంతరం మెగురైన వైద్యం అందించేందుకు సరిపడా డాక్టర్లు, సిబ్బందిని నియమించి సేవలు అందిస్తోంది. ఏజెన్సీలో అంటువ్యాధులు ప్రబలకుండా 2016 నుంచి ప్రభావిత గ్రామాల్లో నిత్యం పర్యటిస్తు వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. గిరిజనులను ఆస్పత్రులకు తరలించేందుకు 108, అవ్వాల్, 104 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

ఐటీడీఏ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఐటీడీఏలో డివిజనల్ కార్యాలయం, సబ్ డివిజనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటోంది. గిరిజన గ్రామాలకు కొట్లాది రూపాయలతో మట్టి, బీటీరోడ్లు, పాఠశాలల భవనాలు, ఇతర కార్యాలయ భవనాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

అటవీ ఉత్పత్తుల కోసం జీసీసీ ఏర్పాటు

అడవులే ఆయువు పట్టుగా మారుమూల ప్రాంతంలోని గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరంగా జీవిస్తున్నారు. అడవిలో లభించే పండ్లను సేకరించి, అమ్ముకొని జీవనాన్ని సాగిస్తున్నారు. ఇందుకు అడవిలో లభించే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఐటీడీఏ జీసీసీని ఏర్పాటు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జీసీసీ ప్రధాన కార్యాలయం, 6 బ్రాంచ్ కార్యాలయాలు, 90 జీసీసీ డిపోలు, 40 జీసీసీ సబ్ డిపోలను ఏర్పాటు చేసి అడవి నుంచి లభించే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలలో గిరిజనులు దళారుల ద్వారా మోసపోకుండా నాణ్యతతో కూడిన వస్తువులను గిరిజనులకు అందించాలని గిరి బజార్లు, గిరి దుకాణాలు, గిరిజన సూపర్ బజార్లను ఏర్పాటు చేసి సేవలందిస్తోంది. జీసీసీ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో జీసీసీ పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేశారు.

గిరిజనులు ఉపాధి రంగాల్లో రాణించేలా చర్యలు

గిరిజనులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి, ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ఐటీడీఏ చర్యలు తీసుకుంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరా క్రాంతి పథంలో ఆయా మండలాల సమాఖ్య ఆధ్వర్యంలో సీసీడీపీ నిధుల నుంచి కోట్లాది రూపాయలతో ఆటోలు, మ్యాక్స్ వాహనాలు మంజూరు చేసింది. అదే విధంగా పీవీజీటీ(ఆదిమ గిరిజన తెగలు కొలాం, తోటి, మన్నేవార్) సీసీడీపీ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూరల్ ట్రాన్స్‌పోర్టు పథకం, డ్రైవర్ కం ఓనర్ స్కీం ద్వారా టాక్సీ వాహనాలను మంజూరు చేసింది. గిరిజనులు పారిశ్రామిక రంగాల్లో రాణించేందుకు, పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకున్నారు. వనబంధు కళ్యాణా యోజన పథకం ద్వారా ఉపాధి కల్పన, గుణాత్మక విద్య, ఉన్నత విద్య, ఆర్థిక స్వావలంబన, తాగునీరు, గృహ వసతి, రోడ్లు, విద్యుత్ తదితర వాటిలో అభివృద్ధికి బాటలు వేశారు. అదే విధంగా గిరిజనులకు మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయం, ఉద్యానవనం శాఖ ద్వారా అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గిరిజన గ్రామాలకు శుద్ధ జలం అందించేందుకు వంద కోట్లతో అడ ప్రాజెక్టు నుంచి మంచినీటి సరఫరా పథకాన్ని ఏర్పాటు చేశారు. పోడు భూములకు హక్కు పట్టాలు, భూ బదలాయింపు చట్టంలో భాగంగా కేసులను పరిష్కరిస్తూ వస్తున్నారు. గిరిజనులకు పౌష్టికాహారం అందించేందుకు అనుబంధ పోషకాహారం, ఆరోగ్య లక్ష్మీ, బాల సదనం, సమగ్ర బాలల పరిరక్షణ పథకం, శిశుగృహ పథకం అమలు చేస్తుంది. ప్రత్యేక వికాసం బాలబడి(చెవిటి, మూగ, అంధత్వం) కలిగి ఉన్న వారికి బడిని ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. నిరుద్యోగ యువతీ, యువకుల కోసం వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్)లను ఏర్పాటు చేసి ఆయా ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు సారవంతంగా చేసేందుకు సాగునీరు అందించేందుకు గిరివికాసం పథకాన్ని ప్రవేశపెట్టారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే పథకాలను ఏజెన్సీలో ఐటీడీఏ అధికారులు అమలు చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో ఖానాపూర్ నియోజకవర్గం

● ఎమ్మెల్యే రేఖా నాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ అన్నారు. మన నియోజవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. నియోజకవర్గంలో కడెం, ఖానాపూర్, జన్నారం, ఉట్నూర్, దస్తురాబాద్, ఇంద్రవెల్లితో పాటు సిరికొండ మండలంలోని కొన్ని గ్రామాలు ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్నాయి. 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పర్యాయాలుగా అజ్మీరా రేఖా నాయక్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో పాటు సాగునీరు, బీటీ రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రహదార్లు, విద్యారంగానికి విశేష కృషి జరిగిందని పేర్కొన్నారు. ఎజెన్సీ మండలమైన ఉట్నూర్ కేంద్రంగా వైద్య రంగంలో పురోగతి ఉంది. ఉట్నూర్‌లో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హాస్పిటల్‌ను 50 పడకలుగా ప్రస్తుతం 70 పడకల ఆస్పత్రిగా ప్రతి సంవత్సరం అప్‌గ్రేడ్ చేస్తూ ఆదివాసులకు నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ప్రస్తుతం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలిసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఏజన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలైన గాదిగూడ, నార్నూర్, జైనూర్, ఇంద్రవెల్లి తదితర గ్రామాల ప్రజలు డయాలసిస్ కోసం 70కిలో మీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ బాధ తప్పింది. దాంతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని తాండ్ర, సాలేవాడ, నర్సాపూర్, ఉమ్రి సాలెగూడ, రామలింగంపేట్, దుర్గాపూర్, మెండపల్లి, దుర్వాగూడ నుంచి కొబ్బరిగూడ, దేవాపూర్, అందుతండా, కేస్లాపూర్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం. ప్రస్తుతం సిరికొండ బ్రిడ్జి నుంచి లక్ష్మీపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఓల్మద్రి నుంచి హార్కపూర్ మీదుగా మండల కేంద్రం వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఉట్నూర్‌లో నాలుగు, ఇంద్రవెల్లిలో మూడు, గౌరాపూర్, అంజి, వడ్‌గావ్‌లో చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. ఉట్నూర్‌లో విద్యావంతులైన గిరిజన యువకులను స్వయం ఉపాధితో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి పర్చేందుకు ఒక్కో లబ్ధిదారులకు రూ.40 లక్షలతో పారిశ్రామిక రుణాలను అందజేశాం. దీంతో పాటు రైతులకు మద్దత్తు ధరనిచ్చి కొనుగోలు చేసిన శనగ, వరి, కందులు జొన్న తదితర పంటలను నిల్వ ఉంచేందుకు ఒక్కో మండలంలో ఇరవై మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించాం. గిరిజనుల విద్య, వైద్యం కోసం దశల వారీగా మన ఊరు..మన బడి పథకం కింద పాఠశాలలో అదనపు తరగతులలో పాటు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నాం. గర్భిణులకు సుఖప్రవవం కోసం అవ్వల్ అంబులెన్స్‌లను అందుబాటులో తీసుకోచ్చాం. ఐటీడీఏ ద్వారా రూ.3కోట్లతో గురుకుల విద్యాలయాలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఉట్నూర్ కేంద్రంలో 220/330 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాం. దీంతో ఏజెన్సీలో విద్యుత్ సమస్య తీర్చడమే గాకుండా గిరివికాసం పథకం కింద ప్రతి గిరిజన రైతుకు ఉచితంగా త్రీఫేజ్ కరెంటును అందిస్తున్నాం. ఉట్నూర్‌లో 80 డబుల్ బెడ్ రూమ్‌లు పూర్తి కాగా అది అర్హులైన వారికి అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు ఉట్నూర్ కేంద్రంగా మినీ స్టేడియాన్ని నిర్మించాం. ఖానాపూర్‌లో డబుల్ బెడ్ రూమ్‌లు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు, అన్ని పంచాయతీ పరిధిలోని క్లస్టర్‌ల వారిగా రైతు వేదికలను ఏర్పాటు చేశాం.

ఉద్యమ ఊపిరి

ప్రజా గొంతుక గూడ అంజయ్య

నవతెలంగాణ-జన్నారం




ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా అనే పాటతో తెలంగాణ దొరల గుండెల్లో వణుకు పుట్టించి వారి పెత్తనాన్ని ప్రశ్నించి పేదల గుండెల్లో నిలిచిపోయారు గూడ అంజయ్య.. ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా అనే పాట ప్రపంచంలోని 16 భాషల్లో ఈయన పాటలు తర్జుమా అయి లక్షలాది గుండెల్లో నిలిచింది. ఈయన పాటలు.. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పటికీ అజరామం. సాహిత్య రంగంలో 45 సంవత్సరాల పాటు తన కలాన్ని ఝులిపించారు. పుట్ట మీద, చెట్టు మీద, పూరి గుడిసె మీద.. ఊరి పిచ్చుకల మీద పేదల రోటికాడి రోకండ లయబద్ధాల మీద అలవోకగా ఎన్నో పల్లె పాటలకు ప్రాణంపోశాడు.

అంజయ్య స్వగ్రామం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామం

లింగాపూర్లోని ఒక పేద కుటుంబంలో గూడ లక్ష్మయ్య-లక్ష్మమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో అంజయ్య నాలుగోవాడు. 1954 నవంబరు 1న లింగాపూర్లో జన్మించాడు. లింగాపూర్లోనే ప్రాథమిక విద్యాభ్యాసం ముగించి ఆ తరువాత లకెట్టిపేటలో పదో తరగతి పూర్తి చేశాడు. వత్తిరీత్యా ఆయన వైద్య ఆరోగ్యశాఖలో ఫార్మాసిస్టుగా పనిచేశాడు. మొదట ఉట్నూరులో విధుల్లో చేరి ఆదిలాబాద్‌తో పాటు చదవండి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఫార్మాసిస్టుగా పనిచేశాడు. ఉట్నూరులో ఫార్మాసిస్టుగా పనిచేస్తుండగా సినిమాలకు పలు పాటలు రాస్తూ ప్రజల్లో చైతన్యం నింపేందుకు కషి చేశాడు. గరీబోల్ల గుడిసెలో.. కూలి. ఇంట జన్మించిన అంజయ్య భద్రం కొడుకో.. నా కొడుకో జరా పైలం కొడుకో అంటూ రంగుల కల సినిమాలో పాటలో కొడుకుకు తండ్రి. జాగ్రత్తలు నేర్పాడు. అంజయ్య రాసిన ఎన్నో పాటలు గద్దర్ గొంతు నుంచి ప్రజల చెవుల్లో మార్మోగాయి. ఇలా సుమారుగా 200 పాటలు వ్రాశారు. తెలంగాణ ఉద్యమపాటకు ప్రాణమై.. గరీబోల్ల బతుకు చిత్రాలను అక్షరాల్లో కూర్చి తనదైన బాణిలో పాటలుగా మలిచి యువతరం గుండెల్లో పాటలతో నింపిన చైతన్య ఊపిరి ఆయన.. పేదల జీవన విధానాన్ని పాటల రూపంలో చూపిన అంజయ్య అనారోగ్యంతో 61 సంవత్సరాల వయసులో మూత్రపిండాలు, కాలేయ వ్యాధితో బాధపడుతూ మతి చెందాడు. అంజయ్యకు బదుగురు సోదరులు, ఒక సోదరి కలదు. వీరందరికి సాహిత్యంలో ప్రవేశం ఉంది. ఆయనకు తల్లి లక్ష్మమ్మ, భార్య హేమనళిని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హేమనళిని గహిణి కాగా ముగ్గురు అమ్మాయిలు శ్రీలత, కవిత, మమత ఉన్నారు.

గిరిజనులకే కిరీటం..!



(మొదటి పేజీ తరువాయి)

వహించారు. అనంతరం 2004లో టీఆర్ఎస్ నుంచి పోటీచేసిన గోవింద్ నాయక్ తన ప్రత్యర్థి రాథోడ్ రమేష్‌ను ఓడించి మూడవ సారి ఎమ్మెల్యేగా పనిచేశారు. 2008లో మెస్రం నాగోరావ్‌పై టీడీపీ నుంచి పోటీచేసిన సుమన్ రాథోడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆమె గెలిచిన ఏడాదికే 2009లో మళ్లీ ఎన్నికలు రావడంతో ఆ ఎన్నికల్లో ప్రత్యర్థి హరినాయక్‌ను ఓడించి సుమన్ రాథోడ్ రెండవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో రితీష్ రాథోడ్‌ను ఓడించి టీఆర్ఎస్ పార్టీ నుంచి ఆజ్మీరా రేఖానాయక్ తొలి విజయాన్ని సాధించారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో అదే పార్టీ నుంచి పోటీ చేసిన రేఖానాయక్ తన ప్రత్యర్థి రాథోడ్ రమేష్‌పై రెండో విజయం సాధించి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న దృష్ట్యా రానున్న ఎన్నికల్లో ఈ నియోజవర్గంలో ఏ పార్టీ పాగా వేస్తుందో చూడాల్సి ఉంది.

నియోజకవర్గంలో ఇప్పటి వరకు గెలిచిన పార్టీ అభ్యర్థులు, ప్రత్యర్థుల వివరాలు ఇవి

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	సమీప ప్రత్యర్థి
1978	అంబాజీ(కాంగ్రెస్.ఐ)	ఎస్.ఏ.దేవ్‌షా(కాంగ్రెస్)
1983	అంబాజీ(కాంగ్రెస్)	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)
1985	ఏ.గోవింద్‌నాయక్(స్వతంత్ర)	బి.జాలంసింగ్ (టీడీపీ)
1989	కె.భీంరావు (కాంగ్రెస్)	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)
1994	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)	కె.భీంరావు (కాంగ్రెస్)
1999	రాథోడ్ రమేష్(టీడీపీ)	ఎల్.భక్షీనాయక్(కాంగ్రెస్)
2004	ఎ.గోవింద్‌నాయక్(టీఆర్ఎస్)	రమేష్‌రాథోడ్(టీడీపీ)
2008	సుమన్‌రాథోడ్ (టీడీపీ)	మేస్రం నాగోరావు(
2009	సుమన్‌రాథోడ్ (టీడీపీ)	హరినాయక్(కాంగ్రెస్)
2014	రేఖానాయక్ (టీఆర్ఎస్)	రితీష్‌రాథోడ్(టీడీపీ)
2018	రేఖానాయక్(టీఆర్ఎస్)	రమేష్‌రాథోడ్(కాంగ్రెస్)

నియోజకవర్గంలో శాసనసభ్యుల పాత్ర

ఆదిలాబాద్ : శాసనాలు చేయటంతో పాటు అవి సక్రమంగా అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించటం శాసనసభ్యుల ప్రధాన విధి. వివిధ శాఖలకు కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చువుతున్నాయో లేదో పరిశీలించటంతో పాటు ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందించాల్సిన ప్రధాన బాధ్యత కూడా వారిపై ఉంది. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను శాసనసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ శాసనసభ్యుల ప్రాధాన్యతలో చివరి అంశం. బడ్జెట్లో వివిధ శాఖలకు నిధులు కేటాయిస్తున్నందున ప్రభుత్వ యంత్రాంగం వాటిని ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. 73, 74 రాజ్యాంగ సవరణ జరిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు విధులు, నిధులు అప్పగించటంలో తాత్సారం చేస్తుండటంతో ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు, వాటి నిర్వహణ పట్ల శాసనసభ్యులే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ప్రభుత్వం కూడా శాసనసభ సమావేశాల నిడివిని రాజకీయ, ఇతర కారణాల వల్ల తగ్గించటంతో శాసనాలు చేయటం, వాటి అమలును పర్యవేక్షించటంపై శాసనసభ్యుల దృష్టి తగ్గింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు నిధులు, విధులు అందించేందుకు ప్రయత్నిస్తుండటంతో భవిష్యత్తులో ఈ పరిస్థితిలో కొంత మార్పు రావచ్చని శాసనసభ్యులు అభిప్రాయపడుతున్నారు. తమ ప్రధాన బాధ్యతలైన బడ్జెట్ అమలు పర్యవేక్షణ, శాసనాలు చేయటంపై దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించటం వల్ల పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆశాభావం శాసనసభ్యుల్లో వ్యక్తమవుతోంది.

స్థానిక సంస్థలకు విధులు, నిధుల బదలాయింపు జరగకపోవడంతో చైతన్యవంతం అవుతున్న ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాల్సిందిగా స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో చిన్న చిన్న సమస్యల పరిష్కారంపై శాసన సభ్యులు దృష్టి సారించాల్సి వస్తుంది. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలు, మండల, జిల్లా పరిషత్‌లు పరిష్కరించాల్సిన సమస్యలను ప్రజలు శాసనసభ్యులకు విన్నవించటంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలతో పాటు కేంద్రం కూడా నేరుగా స్థానిక సంస్థలకు నిధులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల స్థానిక ప్రజాప్రతినిధులకు మరితం ప్రాధాన్యత పెరుగుతుంది. అప్పుడు అభివృద్ధి కార్యక్రమాలలో శాసనసభ్యుల పాత్ర తగ్గి వారు శాసన నిర్మాణం, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు, బడ్జెట్ సక్రమంగా అమలవుతుందో లేదో పర్యవేక్షించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. శాసనసభ్యులకు మాత్రం ఈ అవకాశం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు క్రూషియల్ బ్యాలెన్సింగ్ నిధుల పేరిట రూ.50లక్షలు ఏడాదికి అందజేసేది. టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుని హయాంలో ఆ నిధులను రద్దు చేశారు. అయితే చంద్రబాబు హయాంలో నియోజకవర్గానికి కోటి రూపాయలు అందజేశారు. శాసనసభ్యులు తమ నియోజకవర్గం పరిధిలో అనారోగ్యానికి గురైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం ఇప్పించేందుకు అవకాశం ఉంది. దేవాలయాలు, పారిశ్రామిక సంస్థలు ఈ నిధికి ధన సాయం చేస్తాయి. రోగం తీవ్రతను బట్టి ఆర్థిక సాయం అందుతుంది. తమ తమ నియోజకవర్గాల్లోని ప్రజలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పథకాల ద్వారా లబ్ధి కల్పించేందుకు అవకాశం ఉంది. జిల్లా పరిషత్ సమావేశాలల్లో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించడంతో పాటు, సలహాలు సూచనలు అందించే అవకాశం ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు కేటాయించాల్సిందిగా సమావేశాల్లో కోరే అవకాశం ఉంది. జిల్లా పరిషత్ సమావేశాలల్లో ఏదైన అంశంపై ఓటింగ్ జరిగినప్పుడు పాల్గొనవచ్చు. నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, మండల పరిషత్ సమావేశాలకు శాసన సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో పాల్గొనటంతో పాటు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌ల పాలక వర్గాలకు, జిల్లా సంస్థల్లో పాలకవర్గ సభ్యులుగా నియమితులయ్యే అవకాశం ఉంది.

ఆదరణకు నోచని జలాశయాలు

- ప్రమాదపుటంచున పల్లెలు
- దీనస్థితిలో జలవనరుల సదర్‌మాట్
- అభివృద్ధి చేస్తే సిరుల పంట



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

కడెం ప్రాజెక్టు, సదర్‌మాట్ జలాశయం అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ఆదరణకు నోచుకోడం లేదు. పుష్కలంగా జలసిరులు ఉన్నా ఖరీఫ్, రబీ పంటలకు పూర్తి స్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేదు. సాగు నీటిని పూర్తి స్థాయిలో వాడుకుంటే సిరులు పండుతాయనడంలో సందేహం లేదు. ప్రతి సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి కడెం ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకుంటోంది. ప్రాజెక్టుకు 18 గేట్లు ఉండగా 4గేట్లు మొరాయించి, తెరుచుకోకపోవడంతో దిగువన ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు అప్రమత్తం చేసినప్పటికీ, గేట్ల మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదంలో పల్లెలు...

గత రెండు సంవత్సరాలుగా వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో దిగువన ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండి ప్రాజెక్టు గేట్లు మొత్తం తెరుచుకోకపోవడంతో ఎప్పుడు ఏమౌతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అవుట్‌ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లింది. ప్రజాప్రతినిధులు, మంత్రుల, అధికారులు వచ్చి పరిస్థితులను సమీక్షించారు. గేట్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

కడెం కింద లక్షల ఎకరాల సాగు

1949-1965 మధ్యకాలంలో నిర్మించిన కడెం ప్రాజెక్టు లక్ష ఎకరాలకు పైగా సేద్యానికి నీరందిస్తోంది. మొదట 62 వేల ఎకరాలకు సాగునీరందించడం లక్ష్యం కాగా, సరస్వతి కెనాల్ ద్వారా ఎస్సారెస్పీ నీటి పంపిణీతో లక్షా75వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి చేరింది. 78 కిలోమీటర్లు ప్రవహించే ఎడమ కాలువ, 8కిలో మీటర్లు ప్రవహించే కుడి కాలువ కింద కడెం, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట్ మండలాలకు చెందిన అనేక గ్రామాల రైతాంగానికి సేద్యానికి నీరందుతోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగి ఉన్న కడెం ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యంతో ప్రమాదకర పరిస్థతికి చేరుకోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గేట్ల ఫిల్లర్లకు బీటలు

కడెం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మించిన గేట్ల ఫిల్లర్లు బలహీనంగా మారినట్టు ఇటీవల కేంద్రం బృందం పరిశీలనలో తేలినట్టు సమాచారం. వరద తాకిడికి బీటలు వారినట్లు తెలుస్తోంది. వరద సమయంలో సులువుగా తెరుచుకోవాల్సిన గేట్లు మోరాయించడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రాజెక్ట్ గేట్లకు వీలైనంత తొందరగా మరమ్మతు పనులు చేపట్టకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి.



దీన స్థితిలో సదర్‌మాట్ రైతాంగం

సదర్‌మాట్ 135 ఏండ్ల చరిత్ర కలిగి ఉంది. ఆనకట్టలో పుష్కలంగా నీరు ఉండి కూడా ఆయకట్టు రైతులు ఏటా సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నాలుగైదు ఏండ్ల నుంచి పూర్తి స్థాయిలో పంట సాగుకు నోచుకోక తీవ్రంగా నష్టపోతున్నారు. కెనాల్‌కు గండ్లు పడటానికి అధికారులు వర్షాలను సాకుగా చూపిస్తున్నారు. నాలుగేండ్ల కింద కోట్ల రూపాయలతో చేపట్టిన కెనాల్ శాశ్వత మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడంతో తరుచు గండ్లు పడుతున్నట్టు స్పష్టమవుతోంది. గ్రామాల సమీపంలో ప్రవహించే చోట ఇరువైపు కెనాల్ కట్టలను ఎత్తుగా, బలంగా నిర్మించారు. పొలాల మధ్యన గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతంలో ప్రవహించే చోట కట్టల ఎత్తు తగ్గించి బలహీనంగా నిర్మించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కారణంగా భారీగా వర్షం పడినప్పుడు వరద నీరు ఎత్తు తక్కువగా ఉన్నచోట కెనాల్ కట్టలపై నుంచి పారడంతో మట్టి కోతకు గురై గండ్లు పడుతున్నాయి. సదర్‌మాట్ కింద 22 కిలోమీటర్ల పొడవునా ఖానాపూర్, కడెం మండలాల పరిధిలోని 24 గ్రామాలకు సేద్యపు నీరు అందుతోంది. కుడి, ఎడమ కాలువల ద్వారా ఖానాపూర్, కడెం మండలాల్లోని ఆయా గ్రామాలకు 14వేల600 ఎకరాలకు సాగునీరు అందుతోంది. సదర్‌మాట్ దిగువన గతంలో ఏడాదికి రెండు పంటలు పండేవి. నాలుగైదు ఏండ్ల నుంచి ఆనకట్టలో పుష్కలంగా నీళ్లు ఉన్నా పంటలు పండించుకోలేని దుస్థితిని నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీ తొలి ఐఏఎస్ మడావి తుకారాం

నవతెలంగాణ-ఉట్నూర్



అసలే పేదరికం.. ఆపై ఆదివాసీ బిడ్డా.. గ్రామాల్లో సౌకర్యాలు లేవని నిరుత్సాహ పడలేదు..పేదరికం వెంటాడుతున్నా ఆవేదన చెందలేదు..అందుబాటులో ఉన్న అరకొర సదుపాయాలనే తన లక్ష్యానికి మెట్లుగా మార్చుకున్నాడు..ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేశాడు. ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే ఆదివాసీల్లో తొలి ఐఏఎస్ అధికారిగా పేరుగాంచాడు. ఉట్నూర్ మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి చెందిన మడావి తుకారాం. మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి చెందిన మడావి బాపురావ్, మాన్కుబాయి దంపతులకు నలుగురు సంతానంలో మూడో సంతానం మడావి తుకారాం. 1951 జూన్ 4న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోని పాఠశాలలో పూర్తి చేసుకున్న ఆయన ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ, పీజీతోపాటు ఉన్నత చదువులు చదివారు. తదనంతరం గ్రూప్-1 సాధించి వివిధ చోట్ల ఆర్డిఓ, సబ్ కలెక్టర్, ఐటిడిఏ ఇన్‌చార్జి పీఓగా ఇలా సుమారు పదిహేనేళ్లపాటు వివిధ హోదాల్లో పని చేసి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేస్తూ జిల్లాలో తొలి ఆదివాసీ ఐఎఎస్‌గా గుర్తింపు పొందారు. ఉన్న ఊరును కన్న తల్లిగా భావించిన మడావి తుకారాం ఆయన స్వగ్రామంలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. వివిధ అభివృద్ధి పనులు చేశారు. తన పని తీరుతో జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారు. అనంతరం ఆయన అనారోగ్యంతో 29 నవంబర్ 1998లో మరణించారు. నేటికి ఆయన స్ఫూర్తితో ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారు.

సమస్యల వలయంలో ఖానాపూర్ నియోజకవర్గం

- ఎండ్ల తరబడి అభివృద్ధికి నోచని గ్రామాలు
- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో ప్రజలు
- ఎన్నికలొస్తేనే సమస్యలపై ప్రస్తావన



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతం. అక్కడ గిరిజన కుటుంబాలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లు, వంతెనలు లేక గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లలేక మాతాశిశుమరణాలు సంభవిస్తున్నాయి. కనీసం అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితుల్లో కొన్ని గ్రామాలున్నాయి. ఆధునిక టెక్నాలజీ పుంతలు తొక్కుతున్న తరుణంలో కనీస సౌకర్యాలు లేకుండా నివసించే గిరిజన గ్రామాలు కోకొల్లలుగా ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ, వ్యవస్థలు సరిగా లేక ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలు వస్తేనే ప్రజాప్రతినిధులకు ప్రజల సమస్యలు గుర్తుకు వస్తాయి. ఎన్నికల్లో గెలిచాక ప్రజల సమస్యలను విస్మరించి తమ వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు.

ఎండ్ల తరబడి అభివృద్ధికి నోచని గ్రామాలు

గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఎన్నికల్లో హామీలిస్తూ గెలిచాక అభ్యర్థులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ వ్యక్తిగత అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తూ, ఆస్తులను పెంచుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేక, వర్షాలు కురిస్తే బాహ్యా ప్రపంచానికి దూరమవుతున్నారు. గ్రామాలకు సరైన రోడ్లు, వంతెనలు లేక రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో విద్య, వైద్యానికి దూరమవుతున్నారు.

కనీస సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో ప్రజలు

గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేదు. పారిశుధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్యం లోపించడంతో గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రభుత్వాలు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఖానాపూర్ మండలంలోని సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే కొన్ని వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉంటుంది. ఎమ్మెల్యే గతంలో హామీ ఇచ్చి ఆ ప్రాజెక్టు వేరే చోట చేపట్టడంతో స్థానిక రైతుల ఆశలు సన్నగిల్లాయి. ఖానాపూర్‌లో రోడ్డు వెడల్పు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంబి మండలంలోని పసుపుల గ్రామ సమీపంలో ఉన్న వాగుపై వంతెన రూ.కోటీ67లక్షలతో నిర్మాణం చేపట్టగా యేడాది కాలంలోనే వరదతో వంతెన తెగిపోయింది. దీంతో వాగు అవతల ఉన్న రాయదారి, అంకెన, పోచంపల్లి, గొర్యంటి, తులసిపేట్, గట్టిగూడం, గొండుగూడెం, షెట్‌పల్లి, దొందరి, వాసుపల్లి, రాంనగర్, రామడుగు గూడాలు బహ్యా ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. పెంబి నుంచి గుల్కంపాండ్రి మీదుగా ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలానికి దగ్గరలో ఉన్న సిరిచెల్మ వరకు రోడ్డు నిర్మిస్తే రవాణ సౌకర్యం మెరుగుపడడంతో పాటు దూరం భారం తగ్గుతుంది. కానీ ఏండ్లుగా నిర్మాణం కలగానే ఉంది. 1954లో నిర్మాణమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతున్నప్పుడల్లా తీర ప్రాంత ప్రజలు భయాందోళన మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు, పూడిక తీతను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. ఐటీడీఏ ద్వారా మారుమూల గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరైనప్పటికీ అటవీ చట్టాల అడ్డుతో రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇందుకు నిదర్శనమే మండలంలోని దంతన్‌పల్లి నుంచి నర్సాపూర్(జె) రోడ్డు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గంలో అనేకంగా ఉన్నాయి. ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే ప్రధాన రహదారిలో దంతన్‌పల్లి నుంచి బీర్సాయిపేట వరకు ఉన్న బీటీ రోడ్డుపై కంకర తేలి, చిన్నపాటి గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని మత్తడి చెరువు, గంగన్నపేట, గోపాయిచెరువు, నాగాపూర్ ఇతర చెరువులకు సరైన కాలువల నిర్మాణాలు చేయకపోవడంతో ఆయకట్టు రైతులు సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్(జె), వంకతుమ్మ, రాజులమడుగు, కన్నాపూర్, బాబాపూర్, ఉమాపతికుంట తదితర గ్రామాలకు వెళ్లాలంటే మధ్యలోని వాగులు దాటుకుంటూ వెళ్లాలి. ఉట్నూర్ కేంద్రంగా మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి మంజూరైనప్పటికీ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఇతర ప్రాంతానికి తరలిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యుల భర్తీకి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకొని మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఖానాపూర్, పెంచి, కడెం, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని గిరిజనులకు పూర్తి స్థాయిలో పోడు పట్టాలు అందలేదు.



ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవలోకి...
- బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు జాదవ్ సుమన్‌బాయి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు జాదవ్ సుమన్‌బాయి స్పష్టం చేశారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. సాధారణ కుటుంబంలో పుట్టి పెరిగి కష్టపడి చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఘనత గిరిజన ముద్దుబిడ్డ జాదవ్ సుమన్ బాయికే దక్కింది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పది సంవత్సరాలు విధులు నిర్వర్తించి తరువాత ఏటీడీఓ, డీసీడీఓగా విధులు నిర్వర్తించడంతో పాటు గిరిజన ఉపాధ్యాయుల సమస్యల సాధనకు గిరిజన ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షురాలుగా పని చేశారు. ఉపాధ్యాయురాలిగా వివిధ ప్రాంతాల్లో పని చేసిన సందర్భంగా ఎందరో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొంటున్నారు. ఏజెన్సీలోని గిరిజనులు చాలా అమాయకులని, ఆ అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ప్రజాప్రతినిధులు వారిని పట్టించుకోవడం లేదని అన్నారు. గిరిజన ప్రాంతాలను విద్య, వైద్యం, రోడ్డు, సాగు నీరు తదితర రంగాల్లో అభివృద్ధి చేసేందుకు 2018లో అక్టోబర్ 29న ప్రభుత్వ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో ఆసిఫాబాద్ జిల్లాలో పార్టీ కండువా కప్పుకున్నానని పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రజాసమస్యలపై పట్టింపులేదన్నారు. స్థానికంగా ఉట్నూర్ కేంద్రంగా ఉంటూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి సీఎం కేసీఆర్, వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేసేందుకు అవకాశం వచ్చినప్పటికీ కొందరి స్వార్థ రాజకీయాలు చేయడంలో పదవీ దక్కకుండా పోయిందని, పదవీ వచ్చి ఉంటే జిల్లా అంతట అభివృద్ధి చేసే అవకాశం వచ్చేదన్నారు. ఐటీడీఏ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలు, నిధులను గిరిజనుల దరి చేర్చడానికి ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని గుర్తు చేశారు. కొన్ని నెలల కింద నిర్వహించిన పార్టీ సభ్యత్వంలో వివిధ మండలాల్లో ముందువరుసలో ఉండే విధంగా తగు కార్యాచరణతో ముందుకు వెళ్లానని తెలిపారు. గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించానని పేర్కొన్నారు. ప్రజల్లో 24గంటలు ఉండి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్ననన్నారు. పార్టీ అధిష్టానం మేరకు తనకు ఎమ్మెల్యే టికెట్ వస్తే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందాలంటే ప్రజల ఆశీస్సులు సైతం ఉండాలన్నారు.

వలస పాలనకు చరమగీతం పాడాలి

- ఖానాపూర్‌లో అభివృద్ధి శూన్యం
- పనులు చేయాలంటే కమీషన్లు ఇవ్వాల్సిందే
- పెంబి జెడ్పీటీసీ జానుబాయి

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ నియోజకవర్గంలో వలస పాలనకు చరమగీతం పాడాలని పెంబి జెడ్పీటీసీ భూక్యా జానుబాయి అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటున్నారే తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని తెలిపారు. ఖానాపూర్‌లో రోడ్ల వెడల్పు పనులు అస్తవ్యస్తంగా మారాయన్నారు. డ్రైనేజీలు సక్రమంగా లేవని, బల్బులు సక్రమంగా లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఉపాధి లేక యువత ఉసురు మంటోందన్నారు. పెంబి మండలంలో గత సంవత్సరం పసుపుల బ్రిడ్జి వర్షాలకు కొట్టుకుపోయిందని, ఇప్పటివరకు అక్కడ ఎలాంటి పనులు జరగడంలేదని అన్నారు. కడం మండలంలో గంగాపూర్ బ్రిడ్జి పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. అంతేకాకుండా ఖానాపూర్ మండల కేంద్రంలో డిగ్రీ కాలేజ్ లేక విద్యార్థులు ఎన్ని ఇబ్బందులకు గురవుతున్నారో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. నిజాం కాలం నాటి తహసీల్దార్ కార్యాలయం ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు మంజూరు కాగా ఖానాపూర్ నియోజకవర్గానికి ఒక్క డిగ్రీ కాలేజీ కూడా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తమ సొంత లాభం కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఉట్నూర్ హాస్పిటల్లో బెడ్స్ లేవని, ఖానాపూర్‌లో సైతం 100 పడకల ఆస్పత్రిగా మారుస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో డయాలసిస్ కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఇంద్రవెల్లి, సిరికొండ గ్రామాల నుంచి ఆయా గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు కూడా సక్రమంగా లేదని పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద వేసిన రోడ్లు మాత్రమే ఇప్పటికీ ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా మహిళా డిగ్రీ కాలేజీ, గిరిజన యూనివర్సిటీ మాటలకే పరిమితమయ్యాయని తెలిపారు. అంతేకాకుండా కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు డబ్బులు కూడా లేవని అన్నారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికి నల్లాలు లేవని, ఉన్నవాటికి నీరు సక్రమంగా రావడం లేదని అన్నారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా లేదని తెలిపారు. ఖానాపూర్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్ లేక గర్భిణులు నిర్మల్ ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. పెంబి మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉందని, దీంతో గర్భిణులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఖానాపూర్, కడెం మండలాలకు వరప్రదాయిని అయిన సదర్‌మాట్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. సదర్‌మార్ శిథిలావస్థకు చేరితే అక్కడక్కడ సిమెంట్ పనులు మాత్రమే చేయించారని అన్నారు. ఖానాపూర్ మండలంలో కావాల్సిన సదర్‌మాట్ బ్యారేజ్ పక్క నియోజకవర్గానికి వెళ్లడానికి ఇక్కడి ప్రజాప్రతినిధే కారణమని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు కమీషన్లు ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు. పదేండ్లలో ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు.

ప్రతి అభివృద్ధి పనిలో కమీషనే..!

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గానికి మంజూరైన ప్రతి అభివృద్ధి పనిలో కమీషన్‌లు తీసుకుంటున్నారని, ఏడాదిలో పసుపుల వంతెన కూలిపోవడమే నిదర్శనమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆరోపించారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. అభివృద్ధి, హామీలు, సమస్యలపై చర్చించారు. కొన్ని వేల ఎకరాలకు సదర్‌మాట్ ద్వారా సాగు నీరందిస్తామని ఎమ్మెల్యే రేఖా నాయక్ ఇచ్చిన హామీ ఉత్తదేనని అన్నారు. సదర్‌మాట్ కాలువ నిర్మాణం జరిగితే రైతులకు కొన్ని వేల ఎకరాలకు సాగు అందించడం ద్వారా రెండు పంటలు పండించే అస్కారం ఉందన్నారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ ఊసే లేకుండా పోయిందన్నారు. పదేండ్ల ఎమ్మెల్యే పాలనలో ఇంద్రవెల్లి, దస్తురాబాద్, పెంబి మండలాల్లో మూడు రైస్ మిల్లులు మినహా ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగినట్టు ఆధారాలున్నాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలకు ట్రాక్టర్ల కొనుగోలులో ఎమ్మెల్యేకు స్వరాజ్ ట్రాక్టర్ల షోరూమ్ డీలర్ల నుండి కమీషన్లు అందాయని తెలిపారు. గిరిజనులకు నియోజకవర్గ వ్యాప్తంగా ఐటీడీఏ ద్వారా సబ్సిడీపై వందకుపైగా ఏఆర్ఎస్ ట్రాక్టర్లు ఇచ్చినట్లే ఇచ్చి లాక్కెళ్లారని తెలిపారు. సోమర్‌పేట్ నుంచి గంగాపూర్‌కు వెళ్లే దారిలో వాగుపై వంతెన నిర్మాణానికి అనుమతులు వచ్చినా కేవలం కమీషన్‌కు కక్కుర్తిపడటంతో ఒకే ఒక్క ఫిల్లర్ వేశారని తెలిపారు. పసుపుల బిడ్జి ఏడాదికే కొట్టుకుపోయిందన్నారు. నియోజకవర్గంలోని మత్తడి, చిక్‌మన్, త్రివేణి సంగమం ప్రాజెక్టులకు ప్రధాన కాలువల నిర్మాణాలు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. కడెం ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులు, పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉట్నూర్, కడెం, పెంబి, ఇంద్రవెల్లి మండలాల్లోని రాజుగూడ, మర్కుగూడ, దొందారి, వాయిపేట్, కల్లూర్‌గూడ, వంకతుమ్మ, రాజుల గూడలతో పాటు మరుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనులకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. కేవలం ఎమ్మెల్యే కొనుగోలు చేసిన భూముల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు అనవరం లేకున్నా కోట్లాది రూపాయలతో బీటీ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఉట్నూర్ మండలం రామలింగంపేట గ్రామ సమీపంలో ఎమ్మెల్యే కొన్న రెండు ఎకరాల భూమికి రోడ్డు వేయడమే దీనికి నిదర్శనమని తెలిపారు. గిరిజనుల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు గతంలో ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు అన్ని సిద్ధం చేశారన్నారు. కేవలం పాలకుల నిర్లక్ష్యంతో గిరిజన యూనివర్సిటీ ములుగు జిల్లాకు తరలిపోయిందన్నారు. బీర్సాయిపేట నుంచి అల్లంపల్లి వరకు బీటీ రోడ్డు లేదని, దంతన్‌పల్లి నుంచి నర్సాపూర్(జే) వరకు బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే పనులు జరగడం లేదని పేర్కొన్నారు. అటవీ శాఖ చట్టాల సాకుతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ కోర్ ఏరియాలోని రాంపూర్, మైసంపేట, అలీనగర్, దొంగపల్లి, మిద్దెచింత గ్రామాల గిరిజనులకు ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదని తెలిపారు. జన్నారంలోని రోటిగూడ గ్రామ లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా మార్చడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదిస్తే ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. ఉట్నూర్, ఖానాపూర్, జన్నారం ఆస్పత్రులను వంద పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తానని తెలిపారు. ఖానాపూర్, జన్నారంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు ఖానాపూర్, జన్నారం రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటుతో పాటు ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీకి కృషి చేస్తానని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీరు, కరెంట్ తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సొంత పనులపై ఉన్న శ్రద్ధ.. అభివృద్ధిపై లేదు..

- రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత

నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే అంటేనే తన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి. కాని నియోజకవర్గ ఎమ్మెల్యేకు సొంత పనులపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యురాలు, ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యే మోసపూరిత హామీలతో అధికారం చేపట్టారని తెలిపారు. నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికాక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్వార్థ రాజకీయాలు చేస్తూ మండలాల్లో అనుచరులతో పాలన సాగిస్తున్నారన్నారు. వారు చెప్పిందే ఎమ్మెల్యేకు వేదంగా మారిందన్నారు. ఎమ్మెల్యేగా 10సంవత్సరాలు అవుతున్నా సమస్యలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. సదర్మాట్ బ్యారేజ్ నిర్మాణానికి నోచుకోకుండా అలాగే ఉందన్నారు. కడెం ప్రాజెక్టు పరిస్థితిని పట్టించుకోవడం లేదని తెలిపారు. నియోజకవర్గంలోని పెద్ద చెరువులకు కాలువలు లేక సాగు నీటి సౌకర్యం లేక అయకట్టు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు ఇప్పటి వరకు కాలువ లేదన్నారు. అనేక గ్రామాలకు వెళ్తేందుకు సరైన రోడ్డు, వంతెనలు నిర్మించడంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అన్నారు. వర్షాకాలంలో బయటకు వెళ్లేందుకు దారులు లేక



గిరిజనులు నాలుగైదు నెలలకు సరిపడా సరుకులు తెచ్చిపెట్టుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా ప్రసవ సమయంలో గిరిజన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల ముందే బంధువుల ఇంటికి వెళ్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో ఎక్కువగా ఉన్నాయన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరికొండ మండల కేంద్రంలో ఇప్పటికీ సెల్ టవర్ లేదని, దీంతో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అయినా అధికార యంత్రాంగం, అధికార ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ తాగునీరు ఇంటింటికి అందడం లేదని వాపోయారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో గిరిజన మహిళలు పౌష్టికాహారం లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా తగు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఆదివాసీ మహిళలు, యువతులపై అఘాయిత్యాలు జరుగుతున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఉట్నూర్ కేంద్రంగా మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ టికెట్ ఎవరికిచ్చిన గెలిచేందుకు అందరం కలిసి పని చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అధికార పార్టీ విస్మరించిన హామీలను ఇంటింటికీ వివరిస్తూ ప్రజల వద్దకు వెళ్లేందుకు తగు కార్యాచరణ సిద్ధం చేశామని వివరించారు.

దత్తత గ్రామాల వైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు

- కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెందూర్ ప్రభాకర్

నవతెలంగాణ-ఉట్నూర్

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తీసుకున్న దత్తత గ్రామాల వైపు ఎమ్మెల్యే కన్నెత్తి చూడటం లేదని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెందూర్ ప్రభాకర్ అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గతంలో అనేక హామీలిచ్చి తీరా గెలిచాక విస్మరించారని అన్నారు. గిరిజనులు ఎక్కువగా నివాసం ఉండే ఆదిలాబాద్ జిల్లాకు గతంలో ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకులంగా ఉన్నప్పటికి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో యూనివర్సిటీ తరలిపోయిందన్నారు. గిరిజనులు ఉన్నతమైన విద్యను అభ్యసించాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, స్థానికంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటుందని, దీనిపై ప్రజాప్రతినిధులు పునరాలోచించాలని పేర్కొన్నారు. సదర్మాట్ బ్యారేజ్‌కి 7కిలో మీటర్ల మేర కెనాల్ నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ గెలిచాక ఊసే లేదన్నారు. సదర్మాట్ బ్యారేజ్‌కి కెనాల్ నిర్మిస్తే కొన్ని వేల ఎకరాలకు రెండు సార్లు సాగు నీరు అందించొచ్చని తెలిపారు. తద్వారా రైతులు రెండు సార్లు పంటలు పండించేందుకు వీలుగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి వర్షాకాలంలో కడెం ప్రాజెక్టుతో ముంపు భయం



వెంటాడుతోందన్నారు. కడెం ఆనకట్ట ఎత్తు పెంచేందుకు ప్రతిపాదించినప్పటికీ ఎమ్మెల్యే చొరవ తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించడంలో విఫలమయ్యారని అన్నారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు ఏజెన్సీకి కేంద్ర బిందువు అయిన ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని అన్నారు. నిత్యం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారని, వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. ఆస్పత్రులలో పూర్తి స్థాయిలో ప్రత్యేకమైన వైద్య నిపుణులతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏకు కోట్లాది రూపాయలు వస్తున్నా చట్టాల పేరుతో ఆ నిధులతో చేపట్టే పనులను అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మరికొన్ని నిధులను ప్రజాప్రతినిధులు వారి అవసరాల కోసం ఇతర పనులకు వాడుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు 2006 ఇచ్చారని అన్నారు. ప్రస్తుతం అందించిన పోడు పట్టాల్లో గిరిజనులకు అన్యాయం జరిగిందని తెలిపారు. కొంత మందికే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మీషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పార్టీ నిర్ణయం మేరకు నియోజకవర్గంలో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వివరించారు.

ప్రజా సేవకే జీవితం అంకితం..

- నియోజకవర్గాన్ని పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసినట్టు బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ప్రజా సేవ చేసేందుకు జెడ్పీటీసీగా ప్రస్థానం మొదలై ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మెన్‌గా ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ఎనలేని సేవ చేశాను. ఇప్పుడు కొందరు అనుభవం లేని రాజకీయాలు చేసి అభివృద్ధిని మరిచారు. నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతోనే సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ఉట్నూర్ కేంద్రంగా ఐటీడీఏను ఏర్పాటు చేసినప్పటికీ ప్రతి మూడు నెలలకోకసారి నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం మూడేండ్ల నుంచి ఇప్పటి వరకు నిర్వహించకపోవడం గిరిజన అభివృద్ధిపై ఏ మేరకు పట్టింపు ఉందో ఇట్టే అర్థమవుతుంది. నేను ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మెన్‌గా ఉన్నప్పుడు ఐటీడీఏ సర్వసభ్య సమావేశం నిర్వహించి, అభివృద్ధికి తగు చర్యలు తీసుకున్నాను. నియోజకవర్గంలో ప్రజలు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ఎమ్మెల్యే మాత్రం కమీషన్‌లు తీసుకొని ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. అధికారులు సైతం ఉత్సవ విగ్రహాలుగానే ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ మాయ మాటలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చారు. రెండేండ్ల నుంచి వరదల కారణంగా కడెం ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం చేతులెత్తేసింది. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ప్రజలు వర్షాలు కురుస్తున్న సందర్భంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఏండ్ల కింద నిర్మించిన కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సమస్యలపై నాయకులకు అవగాహన లేదన్నారు. అభివృద్ధి చేసామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం నియోజకవర్గంలో ఎక్కడ చూసిన అవినీతి, అక్రమాలే దర్శనమిస్తున్నాయన్నారు. పార్టీని కాపాడుకొనేందుకు రాజకీయ రంగంలో ఉన్నారే తప్ప నియోజకవర్గంలో గిరిజనులు, గిరినేతరులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎక్కడికక్కేడే తిష్టవేసి ఉన్నా ఈ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి స్థానిక నాయకులు లేరని ఎక్కడినుంచో వచ్చే వారికి టికెట్లు ఇస్తే అభివృద్ధి ఏం చేస్తారని ప్రశ్నించారు. స్థానిక నాయకులకు అవకాశం ఇచ్చే విషయంలో కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. నష్టపోయిన పంటలకు ఇప్పటి వరకు సర్వే కూడా చేయలేదని, కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని అన్నారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, ఇంటింటికీ ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ పథకం అవినీతి, అక్రమాల అడ్డాగా మారిందన్నారు. హైదరాబాద్ నడి బొడ్డున ప్రజలు తాగే నీటిని గిరిజన ప్రాంతవాసులకూ అందజేస్తామని చెప్పినా ఆచరణలో విఫలమయ్యారని తెలిపారు. ప్రధాని మోడి చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. పార్టీని గెలిపించుకునేందుకు జనాల్లోకి వెళుతున్నామని, ప్రజల ఆశీస్సులుంటే మళ్లీ ఎమ్మెల్యేగా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

పోడుకు మోక్షం..ఆదివాసుల్లో హర్షం..!

- హక్కుపత్రాల జారీతో లబ్ధిదారుల్లో ఆనందం
- ఏండ్ల నాటి సమస్యకు లభించిన పరిష్కారం
- ఉమ్మడి జిల్లాలో 37,401మందికి ప్రయోజనం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా మిగిలిపోయిన పోడు భూముల సమస్యకు పరిష్కారం లభించింది. పోడు భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసులకు ఆ భూమిపై హక్కులు లభించాయి. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటకు వచ్చిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ ప్రక్రియను ఇక్కడ్నుంచే ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలో అర్హులైన గిరిజనులు 37,401మందికి పోడుపట్టాలు జారీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటిని వారం రోజుల్లో ఆయా మండలాల వారీగా అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హక్కుపత్రాలు పొందిన వారికి ప్రభుత్వం తొలి విడత పెట్టుబడి సాయం అందజేస్తామని కూడా ప్రకటించింది. దీంతో ఏండ్లుగా పోడు పట్టాల కోసం పోరాడుతున్న గిరిజనుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపించడం లబ్ధిదారుల్లో ఆనందం నింపింది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూముల అంశం ప్రధానంగా ఉండేది. అనేక మంది ఆదివాసీ గిరిజనులు వారి తాతముత్తాతల కాలం నుంచి అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ సంబంధిత భూములకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం పొందలేకపోయారు. బ్యాంకు రుణాలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమాతో పాటు పంట కొనుగోళు ..అమ్మకాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూములు దున్నడం..పంటలు పండించేది వారేనైనా హక్కుపత్రం లేకపోవడంతో ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమయ్యారు. దీంతో పోడు భూములకు పట్టాలు జారీ చేయాలని అనేక ఏండ్లుగా ఉద్యమించారు. గిరిజన సంఘాలతో పాటు ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు వీరికి బాసటగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హక్కుపత్రాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారు. కానీ కాలయాపన జరగడంతో ఆదివాసీ గిరిజన సంఘాలు, గిరిజనులు పలుమార్లు ఉద్యమాలు చేపట్టారు. అనేకసార్లు గిరిజన సాగుదారులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణలు నిత్యకృత్యమయ్యేవి. ఈ ఘర్షణల్లో పలువురు ఆదివాసీ గిరిజనులు జైలుకు వెళ్లిన సందర్భాలు ఉండగా.. అటవీ అధికారులకు గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజాగా కిందటి నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన లబ్ధిదారులకు హక్కుపత్రాలు పంపిణీ చేయడంతో ఏండ్ల నాటి సమస్యకు పరిష్కారం లభించింది.

ఉమ్మడి జిల్లాలో 37,401మందికి లబ్ధి

ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం పోడు భూములకు హక్కుపత్రాలు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 37,401మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వం జిల్లాలో 1,03,896 ఎకరాలకు హక్కుపత్రాలు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 31,683 ఎకరాలకు గాను 12,222మందికి హక్కుపత్రాలు జారీ చేయగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 47,138 ఎకరాలకు గాను 15,519మందికి, నిర్మల్ జిల్లాలో 20,051 ఎకరాలకు గాను 7257మందికి, మంచిర్యాల జిల్లాలో 5024 ఎకరాలకు 2403మందికి హక్కుపత్రాలు జారీ చేశారు. త్వరలోనే వీరికి రైతుబంధు డబ్బులు కూడా ఖాతాల్లో జమ కానున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు గిరిజన లబ్ధిదారులకు దక్కనుండటంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాకే గుర్తింపును తెచ్చిన బి.చంద్రయ్య

నవతెలంగాణ-జన్నారం

హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన బి.చంద్రయ్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందినవారు. తేది10.5.1954న ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 6వ తరగతి వరకు సమీప గ్రామమైన తపాల్‌పూర్ చదివారు. 1971-నుండి 1973 వరకు ఇంటర్మీడియట్, 1973-76 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినారు. 1977-81వరకు ఎల్ఎల్‌బీ పూర్తిచేసి ఆ తరువాత ఎల్ఎల్ఎం కూడ పూర్తిచేసినారు. 1991-95లోని ఆయన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1992 నుండి 2002వరకు ప్రభుత్వ న్యాయవాదిగా హైకోర్టులో పనిచేసినారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యుల్డు కులాల సహకార సంస్థ, సంఘీక సంక్షేమ, గురుకుల విద్యాసంస్థల సొసైటీ, ఆంధ్ర మున్సిపాలీటీలు తెలంగాణ ఏరియాలోని మున్సిపాలిటీలకు లీగల్ అడ్వైజర్‌గా పనిచేశారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా నియమించబడినారు. 1999 నుండి 2002 మధ్య కాలంలోని 'లా' ఉస్మానియా స్టడీ బోర్డు సభ్యునిగా పనిచేశారు. 2005లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2006లో శ్వాశత హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016లో పదవీ విరమణ అయ్యారు.



కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అవినీతిని బట్టబయలు చేస్తాం
- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్

రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాకు బహుమతిగా ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిదేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశ, నియంత, కుటుంబ పాలన కొనసాగిస్తోందన్నారు. ప్రజల సంక్షేమాన్ని మరిచి పోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నిక సమయంలో అబద్ధపు హామీలను ఇస్తూ, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తూ వస్తోందన్నారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయిందన్నారు. మంత్రితో పాటు కుటుంబ సభ్యులు, అనుచరులు వేల ఎకరాల భూములు కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కేంద్ర నడిబొడ్డున ప్రభుత్వ భూములున్న స్వలాభం కోసం తన సొంత గ్రామమైన ఎల్లపల్లి గ్రామ సమీపంలో కలెక్టరేట్ సమీకృత భవనాన్ని నిర్మించారని తెలిపారు. దీంతో ప్రజలకు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి దూర భారం పెరిగిందన్నారు. నిర్మాణానికి ముందు బినామీల పేరుతో వందల ఎకరాలు కొనుగోలు చేశారన్నారు.

ప్రస్తుతం సోఫీ నగర్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాను జీఓ 220 పేరుతో మంజులాపూర్, తల్వేద గ్రామ పరిసరాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారని అన్నారు. తమ స్వలాభం కోసం ధనార్జనే ధ్యేయంగా ఈ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారని, అక్కడి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఈ మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తామని అన్నారు. ప్రమాదకరమైన ఇథనాల్ ఫ్యాక్టరీని దిలావర్‌పూర్ మండల సమీపంలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఒక పర్యావరణ శాఖ మంత్రిగా ఉండి ఇటువంటి నిర్ణయం తీసుకొని అనుమతి ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. ఈ ఫ్యాక్టరీతో చుట్టుపక్కల ప్రాంతాలు, చెరువులు, పంట పొలాలు కలుషితమవుతాయని అన్నారు. జిల్లాతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు పెరిగాయన్నారు. సుందరీకరణ పేరుతో పైపై మెరుగులు దిద్దారని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు మంత్రితో పాటు మున్సిపల్ చైర్మెన్ దండుకున్నారని విమర్శించారు. వార్డులలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు లేక, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తీర్చలేక అధికారంలో ఉన్న కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారని వెల్లడించారు. గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు లేక సర్పంచులు సైతం అసంతృప్తిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇక సండే నాయకుడైన మహేశ్వర్‌రెడ్డి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దీక్షలు చేపట్టడం హాస్యాస్పదమన్నారు. ఇన్ని రోజులు గుర్తుకురాని నియోజకవర్గ సమస్యలు ఎన్నికల సమయంలో ఎలా గుర్తుకు వచ్చాయని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ గెలిచి పూర్వ వైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. రైతులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

మన నవతెలంగాణ
ఆసిఫాబాద్
నియోజకవర్గం ప్రత్యేక సంచిక
కుమురంభీం జిల్లా | 8 పేజీలు | సోమవారం 21 ఆగస్టు 2023

- 1962 నుంచి ఈ రెండు వర్గాలదే ప్రాతినిధ్యం
- తొలుత కాంగ్రెస్..అనంతరం కమ్యూనిస్టుల ముద్ర
- రెండు సార్లు టీడీపీ..ఒకసారి టీఆర్ఎస్‌కు పట్టం
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామాలు
- తాజాగా ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

దళిత, గిరిజనులదే హవా..!

కుమురంభీం జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం జిల్లా కేంద్ర నియోజవర్గంగా ఉండటంతో పాటు పది మండలాలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, గాదిగూడ మండలాలు సైతం ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోకే వస్తాయి. రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం ఈ నియోజకవర్గం ప్రత్యేకత. జల్,జంగల్, జమీన్ కోసం పోరాడిన మన్యం వీరుడు కుమురంభీం పోరు సల్పిన జోడేఘాట్ ఈ నియోజకవర్గంలోనే ఉండటం విశేషం. మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ దంపతులు సైతం ఇక్కడే నివసించడం గమనార్హం. అనేక చారిత్రక ప్రాంతాలు, ప్రకృతి అందాలకు నెలవైన ఈ నేల అనేక ప్రత్యేకతలు సంతరించుకుంది. రాజకీయంగా తొలుత ఈ నియోజకవర్గం ఆవిర్భావంలో ఐదేండ్ల పాటు అగ్రవర్ణాలు పరిపాలించగా.. తదనంతరం 1962 నుంచి ఇప్పటి వరకు దళితులు, గిరిజనులే పాలకులుగా ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీడీపీ, టీఆర్ఎస్ పార్టీలు ప్రాతినిధ్యం వహించాయి.

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆసిఫాబాద్‌తో పాటు రెబ్బెన, తిర్యాణి, కెరమెరి, వాంకిడి, జైనూర్, సిర్పూర్(యు),లింగాపూర్‌తో పాటు నార్నూర్, గాదిగూడ మండలాలు కలిగి ఉంది. నియోజకవర్గం ఆవిర్భావంలో మూడు దఫాలు గిరిజన సామాజిక వర్గ ఎమ్మెల్యేల ఏలుబడిలో ఉండగా..తదనంతరం ఏడు సార్లు దళిత సామాజిక వర్గానికి చెందిన వారు ప్రాతినిధ్యం వహించారు. రాజకీయంగా ఈ నియోజకవర్గం తొలుత కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండగా.. అనంతరం కమ్యూనిస్టుల పాలనలోకి వచ్చింది. అనంతరం టీడీపీ, టీఆర్ఎస్‌కు సైతం అవకాశం కల్పించింది. 1952లో ఆవిర్భవించిన ఈ నియోజకవర్గంలో రెండు సార్లు ఎన్నికలు జరగ్గా.. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా సోషలిస్టు పార్టీ ప్రతిపక్ష పాత్రను పోషించింది. 1957లోనూ కాంగ్రెస్ రెండు సార్లు గెలుపొందగా.. పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్)



ప్రత్యర్థిగా వ్యవహరించింది. ఈ రెండు దశల్లోనూ అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు శాసనసభ్యులుగా వ్యవహరించారు.తొలినాళ్లలో సోషలిస్టు, పీడీఎఫ్ పార్టీలు సైతం ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రభావం చూపించాయి.

దళితులు..గిరిజనులదే పాలన..!

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు శాసనసభకు ఎన్నికలు జరగ్గా ఇందులో ఎనిమిది సార్లు కాంగ్రెస్, మూడుసార్లు సీపీఐ, రెండు సార్లు టీడీపీ, ఒకసారి టీఆర్ఎస్ విజయం సాధించాయి. ఈ నియోజకవర్గం 1962లో తొలిసారి గిరిజన(ఎస్టీ)

▸ మిగతా..4లో...

బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా బెజ్జూర్ వాసి ఎంపిక

నవతెలంగాణ-బెజ్జూర్



బాడర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) కానిస్టేబుల్‌గా బెజ్జూర్ గ్రామానికి చెందిన ఔత్కార్ గిరీందర్ ఎంపికయ్యారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో 46 మార్కులు సాధించి బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పేద కుటుంబానికి చెందిన గిరీందర్‌కు దేశ సేవ చేసేవ అవకాశం రావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి చదివినందుకు ఫలితం లభించిందని, తాను బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైనందుకు ఎంతో సంతోషంగా ఉందని, భారత్ సెక్యూరిటీ ఫోర్స్‌లో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన గృహలక్ష్మి సర్వే

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో గృహలక్ష్మి సర్వే శనివారం ముగిసిందని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అమ్జత్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిశీలించి తయారుచేసిన నివేదికను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసినట్టు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

నేడు మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని 32 మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 27 మద్యం దుకాణాల దరఖాస్తుదారులు నేడు కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా ఇన్‌ఛార్జి ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి కలెక్టరేట్ కార్యాలయంలోని జీ36 మీటింగ్ హాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు, ఉదయం 10 గంటలకు లక్కీ డ్రా కార్యక్రమం ప్రారంభమవుతుందని దీనిలో ఆసిఫాబాద్ 009 రెబ్బెన (9), ఆసిఫాబాద్ 010 గోలేటి (8), ఆసిఫాబాద్ 029 కర్జవెల్లి (01), అసిఫాబాద్ 031 సిర్పూర్(యు) (02), ఆసిఫాబాద్ 032 లింగాపూర్ (01) దుకాణాలు మినహా మిగతా వాటికి లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పై ఐదు దుకాణాలకు త్వరలో తేదీలు ప్రకటించనున్నట్లు వివరించారు.

ఏఎన్ఎంల రాష్ట్ర సమావేశంలో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండవ ఏఎన్ఎంల రాష్ట్రస్థాయి నిరవధిక సమ్మెలో భాగంగా 5వ రోజు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడంలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దివాకర్, బోగే ఉపేందర్, రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు నాచర్ల వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం పుణ్యవతి, జిల్లా ఉపాధ్యక్షులు భాగ్య, ప్రచారకార్యదర్శి ఎన్.భూదేవి, ఆవునూరి కమల, కోశాధికారి రేగుంట సునీతలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పరికిపండ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ అధ్యక్షతన నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

మహనీయుల స్ఫూర్తితో ప్రజా సేవ

- గిరిజనులకు చైతన్య పర్చడమే ప్రథవ కర్తవ్యం
- పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా
- టీజీఓ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అజ్మీర శ్యాంనాయక్

నవతెలంగాణ-కెరమెరి



అబేద్కర్, జ్యోతిబాపూలే మహనీయుల స్ఫూర్తితో ప్రజా సేవకు అంకితం అవుతాను. గత రెండున్నర ఏళ్లుగా ప్రజల్లో ఉంటున్నానని ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేందుకు తన వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజానీకానికి తోడ్పాటు అందించేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రభుత్వ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా బాధ్యత గా సేవాలందించడమే ద్వేయంగా పని చేస్తానని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాకి జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహించానని తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా ఆసిఫాబాద్ నియోజక ప్రజలతో అనుబంధం ఉందని అన్నారు. తన భార్య ప్రస్తుత ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఆసిఫాబాద్ జడ్పీటీసీగా గెలుపొంది ఇక్కడ నియోజకవర్గ ప్రజలతో తత్సంబంధాలు కలిగి ఉన్నాయని అన్నారు. భార్య రేఖానాయక్ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థిగా 2009 ఎన్నికల్లో పోటీ చేసి సుమారు 16,వేల ఓట్లు సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా తాను జిల్లా రవాణా శాఖ అధికారిగా రాయలసీమ చిత్తూరు జిల్లా రేణిగుంటలో పనిచేస్తున్న సమయంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సందర్భంలో తాను కూడా తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని తపనతో తెలంగాణకు బదిలీ చేయించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూనే ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘానికి జిల్లా అధ్యక్షునిగా పనిచేశానని ఈ సందర్భంగా తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చినట్లు చెప్పారు. ఉద్యోగులను తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకునేలా కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు.

సేవ చేసేందుకే ఉద్యోగానికి రాజీనామా

జిల్లా రవాణా అధికారిగా ప్రజలకు సేవలందించినప్పటికీ, ప్రజలకి మరింత చేరువగా ఉంటూ సేవ చేయాలనే ఆలోచనలో భాగంగా తన ఉద్యోగానికి స్వచ్ఛంద పదవి విరమణ చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో చేపట్టాల్సినటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అనేకం ఉన్నాయని అన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరముందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అనేక వనరులు ఉన్నాయని, పరిశ్రమలను నెలకొల్పినట్లైతే అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి అన్నారు. దీంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పర్యటించానని అన్నారు. పలు మండలాల్లోని నదుల పైన నేటికీ వంతెనలు పూర్తి కాక అనేక గ్రామాలకు రావాణ సౌకర్యం లేదని అన్నారు.

గిరిజనుల మధ్య విభేదాలు సృష్టించారు

ఆదివాసీ గిరిజన ప్రజలతో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని పేర్కొన్నారు. గిరిజన సంఘాల నాయకులు తనను ఉట్నూరులో ఘనంగా సన్మానించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. లంబాడి ఆదివాసి గిరిజనుల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని చెప్పారు. కొంతమంది తమ రాజకీయ ఎదుగుదల కోసం, స్వార్థపూరిత రాజకీయాలతో గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించినట్లు పేర్కొన్నారు. తాము ఎన్నో ఏళ్లుగా ఆదివాసి ప్రజల మధ్య ఉంటూ స్నేహ భావాలతో కలిసిమెలిసి ఉంటున్నామన్నారు. ఆదివాసి ప్రజలు కల్మషం, స్వార్థం లేనటువంటి అమాయక ప్రజలని చెప్పారు. వారిని చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. వారి సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందిస్తూనే వారిలో ఉన్న మూఢవిశ్వాసాలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. ఆదివాసీ గిరిజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సినటువంటి బాధ్యత పాలకులపై ఉందన్నారు.

రవాణ సౌకర్యం మెరుగు పరుస్తా

అనేక గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యాలు కల్పించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. ఓకే మండలానికి చెందిన ఇద్దరు ఇప్పటికే ఎమ్మెల్యేలుగా పనిచేశారని, ఈ దఫా ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు మార్పుని కోరుకుంటున్నారని అన్నారు, ఆసిఫాబాద్ నియోజకవర్గం ప్రజలు తనను ఆదరిస్తే, విద్యావంతునిగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో

ఉన్న సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజల సమస్యలను, అవసరాలను గుర్తించించానన్నారు. అసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలకు సేవలందించే అవకాశం లభిస్తే అంబేద్కర్ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానన్నారు.

ఆసిఫాబాద్ మున్సిపాలిటిపై వీడిన స్తబ్దత

- 2024 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి
- రాజంపేట ప్రత్యేక జీపీగా జీఓ విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా నూతన జిల్లాగా ఆసిఫాబాద్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ మున్సిపాలిటీగా మారకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించినప్పటికీ 1/70 చట్టం పరిధిలో ఉండడం పాలనాపరమైన ఇబ్బందులతో గవర్నర్ అనుమతి అవసరమైంది. దీనితో మున్సిపాలిటీగా ప్రకటించి మూడున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. తాజాగా నాయకుల ఒత్తిడితో ప్రభుత్వం 1/70 చట్టం అమల్లో ఉన్న రాజంపేటను జీపీగా మార్చడానికి సంబంధించిన జీవో విడుదల చేసింది. పాలకవర్గం లేక ప్రత్యేక అధికారుల పాలనలో అటు మున్సిపాలిటీ కాకుండా ఇటు గ్రామపంచాయతీ కాకుండా కొనసాగుతున్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారాలంటే అసెంబ్లీలో బిల్లు పెట్టాల్సి ఉండగా ఆ ప్రక్రియ పూర్తిచేసి రాజంపేట కొత్త గ్రామ పంచాయతీగా గుర్తిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో పాటు 2024 ఏప్రిల్ 1 నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారనుంది.

40 ఏండ్ల నిరీక్షణ ఫలించింది

1913 నుంచి 1940 వరకు జిల్లా కేంద్రంగా కొనసాగిన ఆసిఫాబాద్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా రెండోసారి కొమురం భీం జిల్లా పేరుతో జిల్లా కేంద్రంగా ఏర్పడింది. నిజాం కాలంలో జిల్లా కేంద్రంగా వెలుగొందిన



ఆసిఫాబాద్ 1940లో జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌కు తరలిపోయింది. అయితే జిల్లా కేంద్రం తరలి పోయినప్పటికీ 1961 వరకు పురపాలక కేంద్రంగా కొనసాగింది. ఆ తర్వాత కాగజ్‌నగర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో ఆసిఫాబాద్ పట్టణాన్ని మేజర్ గ్రామ పంచాయతీగా మార్చారు. తాజాగా 2019లో ప్రభుత్వం ఆగస్టు 2న నూతన మున్సిపాలిటీగా ఆసిఫాబాద్‌ను ప్రకటించడంతో 56 సంవత్సరాల తర్వాత మున్సిపాలిటీగా రూపుదిద్దుకునే అవకాశం పొందింది.

మునిసిపాలిటీగా మారనున్న ఆసిఫాబాద్

2019లో ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించిన తర్వాత జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. అయితే అవి మున్సిపాలిటీ బోర్డు వరకు మాత్రమే పరిమితమయ్యాయి. తాజాగా ప్రభుత్వం రాజంపేట ఆసిఫాబాద్ నుండి తొలగిస్తూ ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు కోసం జీఓ విడుదల చేసి దీనికి సంబంధించి బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక తీర్మానం చేసింది. దీనితో ఏప్రిల్ 1, 2024 నుండి మున్సిపాలిటిగా మారనుంది.

అభివృద్ధికి ఆస్కారం లభించింది

ప్రస్తుతం ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీలో రాజంపేట, జనకాపూర్, వైఎస్ఆర్‌నగర్, ఆర్ఆర్ కాలనీ వరకు విస్తరించి ఉంది. రాజంపేట నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవిస్తే ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి విస్తరించిన ప్రాంతంతోపాటు జూబ్లీ మార్కెట్, టీఆర్‌నగర్, పొట్టి శ్రీరాములుచౌక్ వరకు ప్రధాన రహదారితోపాటు రాజంపేట ప్రాంతంలోకి రానుంది. దీనితో ఆసిఫాబాద్ అభివృద్ధి చెందే ఆస్కారం లభించింది.

రాజంపేటకు అధిక ఆదాయం

రాజంపేట నూతన గ్రామపంచాయతీగా మారిన తర్వాత ప్రస్తుతం ఉన్న కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌తో పాటు అనేక కమర్షియల్ ప్రాంతాలు రాజంపేట పరిధిలోకి రానున్నాయి. దీనితో ఆసిఫాబాద్‌తో పోలిస్తే రాజంపేట ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి ప్రత్యేకంగా మార్కెట్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక దృష్టి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజకీయాల్లో రాణించాలంటే వ్యక్తిగత ప్రతిష్టతో పాటు పార్టీల అండదండలు ఉండాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న తండ్రి కొట్నాక భీమ్ రావ్ వారసురాలిగా రాజకీయాలపై ఎటువంటి అవగాహన లేకున్నప్పటికీ ప్రజలతో మమేకమై పనిచేసే సమర్థత ఉన్న నేతగా ఎంపీటీసీతో ప్రారంభమైన ప్రస్థానం ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్పర్సన్ వరకు కొనసాగుతూ రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ నుండి టికెట్ వస్తే నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక దష్టి కేంద్రీకరిస్తానని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. నవతెలంగాణతో ఆమె మాట్లాడారు.



2014లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాను. గత ఎన్నికల్లో పోటీ చేసి తక్కువ మెజారిటీతో ప్రస్తుత ఎమ్మెల్యేపై ఓడిపోయాను. రెండుసార్లు తనను నమ్మి అధికార పార్టీ సీటు కేటాయించింది. ప్రస్తుతం కూడా అదే నమ్మకంతో టికెట్ కేటాయిస్తుందని భావిస్తున్నాను.పార్టీలో ఎవరూ లేనప్పుడు 2010లో పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేశాను. అధినాయకత్వానికి నాపై నమ్మకం ఉందని భావిస్తున్నాను. టికెట్ రాకుంటే పార్టీ మారే ఆలోచన ప్రస్తుతానికి ఏదీ లేదు. ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ప్రస్తుతం ఎంతగానో రాష్ట్రం అభివృద్ధి చెందింది.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

యువతకు ఉపాధి కల్పించే దిశగా పరిశ్రమల స్థాపన కోసం కషి చేస్తాను. గతంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి వాటిని తెరిపించడంతో పాటు కొత్త పరిశ్రమలు తెచ్చే దిశగా కృషి చేస్తాను. బెల్లంపల్లిలో పరిశ్రమ రావడంతో దాదాపు 2000 మంది యువతకు ఉపాధి లభించింది. చదువుకున్న ప్రతి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. దీనిలో భాగంగా వాంకిడిలో సీఎఫ్‌సీ ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే బెండారాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాము.

పోడు హక్కు పత్రాలు ఇచ్చాం

ఆదివాసీలు పోడుసాగుపై జీవిస్తూ ఎన్నో సంవత్సరాల నుండి జీవన పోరాటం కొనసాగిస్తున్నారు. గతంలో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ అంశాన్ని తీసుకువెళ్లాను. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో 2018 ఎన్నికల్లో నిర్వహించిన ప్రచార సభలో కేసీఆర్ ప్రకటన చేశారు. దానికి కట్టుబడి జిల్లాలో పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేశాం. ఈ విషయంలో నా కర్తవ్యం పూర్తికాలేదు. ప్రతి సాగుదారునికి త్రీ ఫేస్ కరెంటు ఇవ్వడంలో భాగంగా గిరి వికాసం పథకం ద్వారా అమలు చేస్తున్నాము. అలాగే అవసరమైన చోట ఇదే పథకం ద్వారా బోర్ వెల్స్ ఏర్పాటు చేస్తున్నాము. మండలంలో కొన్నిచోట్ల బోర్ వెల్స్ పూర్తికాలేదని నా దృష్టికి వచ్చింది. వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాను.

పరిష్కరించాల్సిన సమస్యలు

వాంకిడి మండలంలోని కిరిడీ గ్రామానికి రోడ్డు పూర్తి చేయడంతో పాటు పాట్నాపూర్, దామాజీ దేవ్ గూడా, పొలాస గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిలు పూర్తి చేయాలి గతంలో మంజూరైన గుండి బ్రిడ్జికి సంబంధించి అధికారులు ఎస్టిమేషన్స్ తప్పు చేయడంతో ఇన్ని సంవత్సరాలు ఆగాల్సి వచ్చింది. అదనపు నిధుల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లడంతో నిధుల మంజూరు ప్రక్రియ పూర్తయింది. తిర్యాని మండలం భీంజిగూడ వద్ద హై లెవెల్ వంతెనల నిర్మాణం కోసం కృషి చేస్తాను. నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలి. గత ఎనిమిది సంవత్సరాల్లో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజలు మంచి నాయకుల వెంట ఉంటారని మరొకసారి నిరూపితం చేయాలని కోరుకుంటున్నాను.

ఆదరణకు నోచుకోని సీఎఫ్‌సీ

నవతెలంగాణ-వాంకిడి

గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ అమలుచేస్తున్న పథకాల్లో సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలిటి సెంటర్) ఆదరణకు నోచుకోవడంలేదు. మండల కేంద్రంలోని ఈ కేంద్రానికి ప్రభుత్వం చేయూతనిస్తే ఈ ఫర్నీచర్ తయారీకేంద్రం మరింత మెరుగు పడే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విచారకరం. వివిధ పథకాల పేరిట కోట్లాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయి. యువతకు ఉపాధిని కల్పించే ఈ తయారీ కేంద్రం గురించి పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గృహ, కార్యాలయాలకు అవసరాలకు ఉపయోగపడే అన్ని రకాల ఫర్నీచర్‌ను చాలా అందంగా తయారుచేస్తారు. ఫర్నీచర్ విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతోనే ఈ కేంద్రం నడుస్తుంది. ఇందులో పనిచేస్తున్న కార్మికుల జీతాలు కూడా ఇందులో నుండే తీసుకోవాలి. గతంలో ఉమ్మడిగా ఉన్న ప్రభుత్వం 1971లో రాష్ట్రవ్యాప్తంగా 56 సీఎఫ్‌సీ కేంద్రాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా అప్పటి తాలుకా కేంద్రమైన వాంకిడిలో రూ.తొమ్మిది వేల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సాయం అందకున్నా కార్మికులు వారు తయారుచేసిన ఫర్నీచర్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతోనే నడిపిస్తూ వస్తున్నారు. 1980లో దీనిని ఐటీడీఏ తన ఆధీనంలోకి తీసుకుంది. నిరుద్యోగ గిరిజన యువకులకు ఫర్నీచర్ తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో 1987-88 సంవత్సరంలో ఐటీడీఏ అధికారులు రూ.నాలుగు లక్షలతో షెడ్లను నిర్మించారు. కాలక్రమేనా కలప కొరత ఏర్పడడంతో 1993-94 సంవత్సరంలో మెటల్ వర్కును సైతం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని గమనించిన ఉమ్మడి జిల్లా కలెక్టర్ సుకుమార్ ప్రహరిగోడ షెడ్ల నిర్మాణానికి రూ.14 లక్షల విలువ చేసే యంత్ర సామగ్రిని సమకూర్చింది.





దాదాపుగా 60 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది.

రోజువారి నిర్వాహణకు సహకారం కరువు

కనీస సౌకర్యాలు కల్పించబడ్డ రోజూవారీ నిర్వహణకు తగిన సహకారం లభించలేదు. కలప, మెటల్ ఫర్నీచర్ కోసం ప్రభుత్వం ఆర్డర్‌లు ఇవ్వడంలేదు. కనీసం నిర్ణయించిన ధరకు కూడా కలప సరఫరా చేయడంలేదు. ప్రయివేటు వ్యాపారం మాదిరిగానే బహిరంగ వేలంలో పాల్గొని కలప కొనుగోలు చేయాల్సి వస్తుంది. బహిరంగ వేలం ద్వారా వచ్చే ధర ఎక్కువగా చెల్లించడంతో ఫర్నీచర్‌కు కూడా ఎక్కువ ధరనే నిర్ణయిస్తున్నారు. దీంతో ఫర్నీచర్ సామాన్యులకు అందుబాటులో ఉండడంలేదు. నాణ్యత కళాత్మకంగా తయారయ్యే ఫర్నీచర్‌కు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. అప్పటిలో ఇక్కడ తయారైన ఫర్నీచర్‌ను రంపజోడవరం, భద్రాచలం, పాలేరు ఐటీడీఏలు కొనుగోలు చేశాయంటే ఆ పని తనాన్ని అంచనా వేయవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థలలై ఉండి, ప్రయివేటు వ్యాపారులతో పోటీపడి కలప వేలంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వమే సబ్సిడీపై నేరుగా కలప సరఫరా చేస్తే సౌకర్యంగా ఉంటుందని కార్మికులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి


జిల్లాలో, రాష్ట్రంలో కానీ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమయ్యే ఫర్నీచర్‌ను ప్రయివేటు వ్యాపారస్తుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. రానురాను ప్రభుత్వ ఆర్డర్‌లు తగ్గుముఖం పట్టడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పని లేక ఇతర వృత్తులవైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో ప్రొడక్షన్ ఓరియంటెడ్ బేసిక్‌పైనే కార్మికులు ఫర్నీచర్ అమ్మగా వచ్చిన లాభాల నుండే జీతాలు తీసుకుంటూ సీఎఫ్‌సీని కాపాడుకుంటున్నారు. వాంకిడి సీఎఫ్‌సీ ఇంకా పనిచేయడానికి కార్మికుల శ్రమశక్తి ఫలితమనే అభిప్రాయాలున్నాయి.



సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

- టీపీసీసీ సభ్యుడు రాథోడ్ గణేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రస్తుతం రాజకీయాలు పూర్తిగా కమర్షియల్‌గా మారడంతో పాటు సంపాదనే లక్ష్యంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం తనకంటూ సమాజంలో ఒక స్థాయి ఉండడంతో పాటు సంపాదనకు కొదువ లేదని సేవ చేయడం లక్ష్యంగా, ప్రజల సామాజిక, ఆర్థిక వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి రాజకీయాల్లోకి వచ్చానని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నియోజకవర్గ టికెట్ ఆశావాహుడు గణేష్ రాథోడ్ నవతెలంగాణతో మాట్లాడారు. బంగారు తెలంగాణ సాధించామని చెబుతున్న కేసీఆర్ వారి ఇంటిని పదవులతో బంగారు తెలంగాణగా మార్చుకున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు నమ్మి ఓటు వేసిన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రజలను మోసం చేశారని అన్నారు. దళిత ముఖ్యమంత్రి పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఉప ముఖ్యమంత్రి అయిన దళిత వ్యక్తి రాజయ్యను బర్తరఫ్ చేయడంతో మరోసారి ఆయన ఆంతర్యం అర్థమైందన్నారు. నియోజకవర్గంలో గత తొమ్మిది సంవత్సరాల్లో అభివృద్ధి పడక వేసిందన్నారు. ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఇద్దరు కూడా తిర్యాని మండలానికి చెందిన వారై ఉండి కనీసం జిల్లా కేంద్రాల నుండి రోడ్డు పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో మద్యానికి ఇచ్చిన ప్రాముఖ్యత గృహలక్ష్మి పథకానికి ఇవ్వడం లేదని దరఖాస్తు గడవు రెండు రోజులు ఇవ్వడమేంటన్నారు. కేసీఆర్ కుటుంబం బాగుపడే తెలంగాణ వస్తుందని ప్రజలు భావిస్తే అనేకమంది బలిదానాలు చేసుకునే వారు కాదని అన్నారు. నియోజకవర్గంలో అనేకమంది ఆదివాసి గిరిజనులు ఉన్నారని వారికి మూఢనమ్మకాలు దూరం చేసి చైతన్యపరిచి విద్య వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్థానికంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకోవడంతోపాటు తన స్వగ్రామం జైనూరు మండలంలో జంగాం గ్రామమని ఇది తెలియని అనేకమంది స్థానికేతరులను విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించానని తనకు సంపాదన ముఖ్యం కాదని వైద్యునిగా ప్రస్తుతం నెలకు రూ.8 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని, దానిని కాదనుకొని ప్రజలకు తన వంతుగా ఏమైనా చేయాలని సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని కొన్నిచోట్ల పూర్తి కాలేదని, కొన్నిచోట్ల పిల్లర్లకే పరిమితం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి శనివారం గుండె కు సంబంధించిన పరీక్షలు చేయడంతో పాటు, జైనూర్, నార్నూర్ ప్రాంతాల్లో ప్రతి బుధవారం వైద్య పరీక్షలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పార్టీకి సంబంధించిన టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నానని ఒకవేళ అధిష్టానం తన మీద నమ్మకం ఉంచి టికెట్ ఇస్తే బరిలో ఉంటానని లేదంటే టికెట్ ఇచ్చిన వారికి మద్దతు ఇస్తానని తెలిపారు. నియోజకవర్గంలో కొంత విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని వాటన్నింటినీ పక్కనపెట్టి అందరితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. గిరిజనులకు గుదిబండగా మారిన జీవో నెంబర్ 3 రద్దు నిర్ణయాన్ని పున సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఇబ్బందిగా మారిన ధరణి రద్దు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఇప్పటికే సర్వేలు నిర్వహించిందని, తాను గత రెండు సంవత్సరాల నుండి పడుతున్న కష్టానం తప్పనిసరిగా పార్టీ గుర్తిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

22న ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జైనూర్

ఈ నెల 22వ తేదీన నిర్వహించబోయే ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పద్మ శ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో వారు ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఆదివాసీ తెగలకు చెందిన తొమ్మిది కులాల కళాకారులు తమతమ సంస్కృతి సాంప్రదాయాలతో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని మార్లావాయి గ్రామంలో నిర్వహించబోతున్నట్టు తెలిపారు. గుస్సాడీ కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సార్‌మేడీ దేవ్‌రావు, నాయకులు జంగు, ప్రకాష్, మారుతి, మనోహర్ పాల్గొన్నారు.

దళిత..గిరిజనులదే హవా..!



(మొదటి పేజీ తరువాయి)

సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడింది. 1962 నుంచి 1972 వరకు మూడు దఫాలుగా కె.భీంరావు కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొంది పి.వి.నరసింహరావు హయాంలో మంత్రిగా సేవలందించారు. అనంతరం 1989లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన ఈయన చెన్నారెడ్డి,నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినేట్‌లోనూ మంత్రిగా పనిచేసిన ఘనత సాధించారు. ఇక్కడ 1962 నుంచి 1978వరకు సీపీఐ ప్రత్యర్థి పార్టీగా వ్యవహరించింది. అనంతరం ఆసిఫాబాద్ నియోజకవర్గం 1978లో దళిత సామాజిక(ఎస్సీ)వర్గాలకు రిజర్వ్ చేయబడింది. 1978లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య గెలుపొందారు. అనంతరం ఈ నియోజకవర్గం కమ్యూనిస్టుల కంచుకోటగా మారింది. 1983, 1985లో జరిగిన వరుస ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన గుండా మల్లేష్ విజయం సాధించారు. అనంతరం 1989లో మళ్లీ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య గెలిచారు. 1994లో మరోసారి సీపీఐ నుంచి గుండా మల్లేష్ విజయం సాధించగా.. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఈ నియోజకవర్గాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడ్నుంచి పోటీ చేసిన పాటి సుభద్ర ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో ఏ.శ్రీదేవీ సైతం టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో మళ్లీ ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆత్రం సక్కు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తొలిసారి టీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. ఈ పార్టీ తరుపున పోటీ చేసిన కోవ లక్ష్మీ ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రభుత్వ విప్‌గా వ్యవహరించారు.

అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లో ఈ సీటును మళ్లీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ పార్టీ తరపున పోటీ చేసిన ఆత్రం సక్కు మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన కాంగ్రెస్ పార్టీని వదిలి అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మరోసారి కోవ లక్ష్మీ ఆత్రం సక్కులు రానున్న ఎన్నికల బరిలో నిలువనున్నారు. బీఆర్ఎస్ తరుపున ఒకరు ఎమ్మెల్యేగా..మరొకరు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నియోజకవర్గంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు..పార్టీల వివరాలు

సంవత్సరం	గెలుపొందిన అభ్యర్థి	ప్రత్యర్థి
1952	కాశీరాం (కాంగ్రెస్)	మారుతీరావు(సోషలిస్టు)
	లక్ష్మణ్ (కాంగ్రెస్)	అడ మెంగు(సోషలిస్టు)
1957	జి.నారాయణ రెడ్డి (కాంగ్రెస్)	ఆర్.కె.శాస్త్రీ (పీడీఎఫ్)
	కాశీరాం (కాంగ్రెస్)	కాశీరావు (పీడీఎఫ్)
1962	కె భీమ్‌రావు (కాంగ్రెస్)	ఏ.ఏ.రావు (సీపీఐ)
1967	కె భీమ్ రావు (కాంగ్రెస్)	ఏ.గంగారెడ్డి (సీపీఐ)
1972	కె భీమ్ రావు (కాంగ్రెస్)	ఎస్.మోతి (సీపీఐ)
1978	దాసరి నర్సయ్య (కాంగ్రెస్)	జి.మల్లేష్ (సీపీఐ)
1983	గుండా మల్లేష్ (సీపీఐ)	డి.నరసయ్య (కాంగ్రెస్)
1985	గుండా మల్లేష్ (సీపీఐ)	డి.నరసయ్య (కాంగ్రెస్)
1989	దాసరి నర్సయ్య (కాంగ్రెస్)	డి.మల్లేష్ (సీపీఐ)
1994	గుండా మల్లేష్ (సీపీఐ)	దాసరి నరసయ్య (కాంగ్రెస్)
1999	పాటి సుభద్ర (టిడిపి)	దాసరి నరసయ్య (కాంగ్రెస్)
2004	అమురాజుల శ్రీదేవి (టిడిపి)	గుండా మల్లేష్ (సీపీఐ)
2009	ఆత్రం సక్కు(కాంగ్రెస్)	పెందూర్ గోపి(టీఆర్ఎస్)
2014	కోవ లక్ష్మి (టిఆర్ఎస్)	ఆత్రం సక్కు(కాంగ్రెస్)
2018	ఆత్రం సక్కు(కాంగ్రెస్)	కోవ లక్ష్మీ (టీఆర్ఎస్)

సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

- పోడుకు హక్కుపత్రాలు అందించడం గొప్ప విజయం
- ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం ఉన్న సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నా.. రాజకీయంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నా.. ఆర్థికంగా పటిష్టంగా ఉండడమే కాకుండా కుటుంబ నేపథ్యం రాజకీయపరంగా ఉండాల్సి ఉంటుంది. అటువంటివి ఏమీ లేకుండా కింది స్థాయి నుండి వచ్చి పేద మధ్యతరగతి ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడమే కాకుండా అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి..సాధించిన విజయాలపై నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడారు. ఆయన మాటల్లోనే

హక్కుపత్రాలు అందించడం గొప్ప విజయం

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీ లోకి చేరే సందర్భంలో రెండు లక్ష్యాలు నిర్దేశించుకున్నా. పోడు సాగుదారులకు పట్టాలు అందించడంతో పాటు నియోజకవర్గంలో రైతులకు పోడు సాగుదారులకు సాగునీటి వసతి కల్పించాలని భావించాను. దీనిలో పోడు సాగుదారులకు భూముల పట్టాలు ఇవ్వడం అనేది జీవితంలో సాధించిన గొప్ప విజయం గా భావిస్తాను. ఇదే సందర్భంలో గిరి వికాసం పథకం ద్వారా ప్రతి గిరిజనుని సాగు భూమి వద్దకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాం. పోడు సాగుదారుల భూములు అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పన కోసం రూ.290 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో వివిధ మండలాల్లోని 150 గ్రామాల మధ్య కనెక్టివిటీ కోసం రూ.400కోట్లతో బీటీ రహదారులు నిర్మించాం. మండలాల్లో రూ.50 కోట్లతో సీసీ రహదారులు నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇంకా కొన్ని రహదారుల నిర్మాణం కావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతులు ఆలస్యం కావడంతో కొంత వెనుకబడ్డాం. తిర్యానికి ఆసిఫాబాద్ నుండి వెళ్లే రహదారి అనుమతులు పూర్తిస్థాయిలో వచ్చాయి. రెండు హై లెవెల్ వంతెనల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. జిల్లాకేంద్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లా కేంద్రంలో రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. క్యాంపు కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తున్నాం. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని ఒకవేళ హైదరాబాద్ వెళ్ళినప్పటికీ నియోజకవర్గ పనుల కోసమే వెళ్లాల్సి వస్తోంది. తన స్వగ్రామానికి వెళ్లి తల్లిని కలవాలనుకున్నప్పుడు కూడా మొదట ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని వారిని కలిసిన తర్వాతే అమ్మ దగ్గరికి వెళ్తున్నా. అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడుతున్న సందర్భంలో ప్రచారంపై మక్కువ లేదు. ప్రజలకు పని పూర్తయితే సరిపోతుందన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మీయ సమ్మేళనాలతో పాటు, సీఎం సభ సక్సెస్ కావడమే తనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. సరైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి మధ్యవర్తుల ప్రమేయం తొలగించడానికి ఆన్‌లైన్ సిస్టం ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రభుత్వ పథకాలు తన క్యాడర్‌కు కాకుండా సరైన లబ్ధిదారులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ద్వితీయ శ్రేణి నాయకులు తనతో కలిసి పని చేస్తున్నారని అయితే ప్రతి సందర్భంలో వారిని ఇబ్బంది పెట్టదల్చుకోలేదు. హంగు ఆర్భాటాలతో అవసరం లేని పరిపాలన కోసం అహర్నిశలు కృషి చేస్తున్నా. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నియోజకవర్గంలో 15 నుండి 20 చెరువులు నిర్మాణం కోసం గుర్తించామని, ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేయడంతో పాటు, అడ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నానని వివరించారు.

స్టడీ సర్కిల్ ఏర్పాటుతో ఉద్యోగాలు

నియోజకవర్గంలో ఉద్యోగ కల్పన కోసం ఐటీ రంగం అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే మంత్రితో మాట్లాడాను. నియోజకవర్గంలో గిరిజన విద్యార్థులతో పాటు బీసీ, ఎస్సీ, మైనారిటీలకు ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తాను. ఇతర వర్గాలతో పోలిస్తే ఆదివాసీలు కొంత వెనుకబడి ఉన్నారని వారి అభ్యున్నతి కోసం మరింత తర్ఫీదు ఇవ్వాల్సి ఉందని దీనికోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంలో ఓసి, బిసి మైనారిటీ, ఎస్సీ వర్గాల్లో కూడా అనేకమంది వెనుకబడి ఉన్నారని, పేదరికంతో బాధపడుతున్నారని వారందరికీ కూడా అండగా ఉంటాను. కొమురం భీం స్టడీ సర్కిల్ ఏర్పాటుకు హైదరాబాద్ చిక్కడపల్లి లో గల శ్యాంప్రసాద్ ముఖర్జీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్టడీ సర్కిల్ ప్రేరణ కలిగించింది. స్టడీ సర్కిల్ ఏర్పాటు ద్వారా ఇప్పటికే నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో 50 మందికి పైగా ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంది. దీనివల్ల 50 కుటుంబాలకు తాను జీవనోపాధి కల్పించినట్లు అవుతుంది. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, భాష పరిరక్షణ కోసం ఉన్న ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియలో గిరిజనులకు ప్రత్యేకంగా చోటు కల్పిస్తూ తీసుకువచ్చిన జీవో నెంబర్ 3 రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కోర్టులో రివ్యూ పిటిషన్ వేసింది. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 275 ద్వారా స్థానిక ఆడివాసీ గిరిజనులకు ఉద్యోగాలు సాధించడం సాధ్యమైంది. భాషాభివృద్ధి జరిగింది. దీని స్థానంలోనే 2001లో జీవో నెంబర్ 3 వచ్చింది. దాన్ని పునరుద్ధరించే వరకు ప్రయత్నాన్ని ఆపేది లేదు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు బ్రిడ్జి నిర్మాణం వచ్చే వర్షాకాలంలో పూర్తవుతుంది. అప్పపెల్లి రహదారి పనులు కూడా ప్రారంభమయ్యేలా చూస్తాను.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

నియోజకవర్గంలో అనేక పర్యటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అభివద్ధి చేయడానికి సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడానని తెలిపారు. జిల్లా కేంద్రంలో అభివద్ధి కోసం మరిన్ని నిధులు ఖర్చు చేస్తాం. రోడ్లు పూర్తి చేయడం డ్రైనేజీ లాంటి వాటిపై నిధులు వెచ్చిస్తాను. వ్యక్తిగత ప్రచారానికి తాను ఎప్పుడు ప్రాముఖ్యత ఇవ్వను. వ్యక్తి శాశ్వతం కాదు. ప్రభుత్వం చేపట్టే పథకాలు, పార్టీ విధానాలు ప్రచారం కావాలి తప్పా వ్యక్తి ప్రచారం కాకూదని నా అభిమతం. గ్రామస్థాయిలో తన కేడర్ బలంగా ఉంది. సాధారణ పౌరుల మాదిరి జీవించడం ఎంతో బాగుంటుంది. బీఆర్ఎస్ టికెట్ తనకు రావడం ఖాయమని ఎందుకంటే గతంలో కాంగ్రెస్ తరపున గెలిచి టీఆర్ఎస్‌లోకి వెళ్లాను. ప్రతిపక్షం నుండి గెలవగలిగానంటే కింది స్థాయిలో క్యాడర్ బలాన్ని అంచనా వేయవచ్చు. ఎదుటివారిని విమర్శించకుండా మన ప్రత్యేకత చూపించాలనే సిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తున్నాను. ఎవరిని విమర్శించాల్సిన అవసరం నాకు లేదు. ప్రతి అంశానికి కాలమే సమాధానం చెబుతుంది. ఓటు వేసే విషయంలో ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని, అయితే అనుకూలంగా అందుబాటులో ఉండే నాయకులను ఎంచుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై మరొకసారి నమ్మకం ఉంచాలని కోరారు.

ఉద్యమ ఊపిరి


ప్రజా గొంతుక గూడ అంజయ్య

జన్నారం : ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా అనే పాటతో తెలంగాణ దొరల గుండెల్లో వణుకు పుట్టించి వారి పెత్తనాన్ని ప్రశ్నించి పేదల గుండెల్లో నిలిచిపోయారు గూడ అంజయ్య.. ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా అనే పాట ప్రపంచంలోని 16 భాషల్లో ఈయన పాటలు తర్జుమా అయి లక్షలాది గుండెల్లో నిలిచింది. ఈయన పాటలు.. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పటికీ అజరామం. సాహిత్య రంగంలో 45 సంవత్సరాల పాటు తన కలాన్ని ఝులిపించారు. పుట్ట మీద, చెట్టు మీద, పూరి గుడిసె మీద.. ఊరి పిచ్చుకల మీద పేదల రోటికాడి రోకండ లయబద్ధాల మీద అలవోకగా ఎన్నో పల్లె పాటలకు ప్రాణంపోశాడు.

అంజయ్య స్వగ్రామం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామం

లింగాపూర్లోని ఒక పేద కుటుంబంలో గూడ లక్ష్మయ్య-లక్ష్మమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో అంజయ్య నాలుగోవాడు. 1954 నవంబరు 1న లింగాపూర్లో జన్మించాడు. లింగాపూర్లోనే ప్రాథమిక విద్యాభ్యాసం ముగించి ఆ తరువాత లకెట్టిపేటలో పదో తరగతి పూర్తి చేశాడు. వత్తిరీత్యా ఆయన వైద్య ఆరోగ్యశాఖలో ఫార్మాసిస్టుగా పనిచేశాడు. మొదట ఉట్నూరులో విధుల్లో చేరి ఆదిలాబాద్‌తో పాటు చదవండి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఫార్మాసిస్టుగా పనిచేశాడు. ఉట్నూరులో ఫార్మాసిస్టుగా పనిచేస్తుండగా సినిమాలకు పలు పాటలు రాస్తూ ప్రజల్లో చైతన్యం నింపేందుకు కృషి చేశాడు. గరీబోల్ల గుడిసెలో.. కూలి. ఇంట జన్మించిన అంజయ్య భద్రం కొడుకో.. నా కొడుకో జరా పైలం కొడుకో అంటూ రంగుల కల సినిమాలో పాటలో కొడుకుకు తండ్రి. జాగ్రత్తలు నేర్పాడు. అంజయ్య రాసిన ఎన్నో పాటలు గద్దర్ గొంతు నుంచి ప్రజల చెవుల్లో మార్మోగాయి. ఇలా సుమారుగా 200 పాటలు వ్రాశారు. తెలంగాణ ఉద్యమపాటకు ప్రాణమై.. గరీబోల్ల బతుకు చిత్రాలను అక్షరాల్లో కూర్చి తనదైన బాణిలో పాటలుగా మలిచి యువతరం గుండెల్లో పాటలతో నింపిన చైతన్య ఊపిరి ఆయన.. పేదల జీవన విధానాన్ని పాటల రూపంలో చూపిన అంజయ్య అనారోగ్యంతో 61 సంవత్సరాల వయసులో మూత్రపిండాలు, కాలేయ వ్యాధితో బాధపడుతూ మతి చెందాడు.



అంజయ్యకు బదుగురు సోదరులు, ఒక సోదరి కలదు. వీరందరికి సాహిత్యంలో ప్రవేశం ఉంది. ఆయనకు తల్లి లక్ష్మమ్మ, భార్య హేమనళిని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హేమనళిని గృహిణి కాగా ముగ్గురు అమ్మాయిలు శ్రీలత, కవిత, మమత ఉన్నారు.

ప్రజల చెంతకు సర్కారు వైద్యం

- తుది మెరుగులు దిద్దుకుంటున్న వైద్య కళాశాల
- నాయకుల కృషితో తీరనున్న ప్రజల కల



రాష్ట్రంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రత్యేకమైనది. భౌగోళిక పరంగా మహారాష్ట్ర సరిహద్దుగా ఉండడం, రాష్ట్ర రాజధానికి ఇతర జిల్లాలతో పోలిస్తే దూరం భారం కావడం.. మౌలిక వసతులు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో అధికారులు స్థానికంగా ఉండడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సందర్భంలో జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా ఆసుపత్రిలో వైద్యులకు ఇతర జిల్లాల కంటే అధికంగా వేతనాలు ఇచ్చినప్పటికీ ఇక్కడ నివాసముండేదుకు కొంత విముఖత చూపారు. ఇదే సందర్భంలో నాయకుల కృషి ఫలితంగా మెడికల్ కళాశాల మంజూరు కావడంతో పాటు నిర్మాణ పనులు కూడా తుది దశకు రావడంతో వైద్య సేవలు మెరుగయ్యే అవకాశం ఉంది.

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ప్రభుత్వం రెండో విడతలు మంజూరు చేసిన మెడికల్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభించాలని నిర్ణయించింది. దీని కనుగుణంగానే భవన నిర్మాణం కోసం స్థలం కేటాయింపుతో పాటు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. భవన నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ.53 కోట్ల వ్యయంతో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీనిలో నాలుగు ఎకరాల్లో 8 బ్లాక్ లతో కళాశాల భవనం నిర్మాణం తుది దశకు చేరుకుంది.

మొదటి సంవత్సరం 100 సీట్ల కేటాయింపు

మొదటి సంవత్సరం ప్రభుత్వం 100 సీట్లు కేటాయించనుంది. ఇందులో 60 మంది బాలికలు 40 మంది బాలురకు సీట్లు కేటాయించనున్నారు. వైద్య కళాశాల నిర్వహణ కోసం 22 మందిని ప్రభుత్వం కేటాయించింది. కళాశాల నిర్వహణకు 55 మంది అవసరం ఉంది. ప్రస్తుతానికి కేటాయించిన 22 మందిలో ఐదుగురు విధుల్లో చేరగా, వీరిలో ఇద్దరు బోధన, ముగ్గురు ఆసుపత్రి వైద్య సేవలకు సంబంధించిన వారున్నారు. మిగతావారు విధుల్లో చేరాల్సి ఉంది. వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా ఆసుపత్రిని సిద్ధం చేయనున్నారు. దీనికి గాను ఇప్పటికే రూ.9 కోట్ల వ్యయంతో చేపట్టిన అదనపు భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళాశాలలో చేరే విద్యార్థుల వసతి కోసం ప్రైవేట్ భవనాలను అధికారులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే పలు భవనాలు పరిశీలించినప్పటికీ వివిధ కారణాలతో వాటిని తిరస్కరించినట్లు తెలిసింది. పాత కలెక్టరేట్ భవనాన్ని ప్రస్తుత సంవత్సరానికి కేటాయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, సంవత్సరంలోగా కళాశాల ఆవరణలో వసతి గృహాలు సిద్ధమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నాయకుల కృషితో తీరనున్న కల

వైద్య సేవల్లో ఇతర జిల్లాలతో పోలిస్తే కొమరం భీం జిల్లా వెనుకబడి ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అటువంటి పేరు చిరస్థాయిగా చెరిపేయాలని ప్రజాప్రతినిధులు భావించాను.ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు నూతన మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా జిల్లాకు కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన అంగీకరించడంతో కళాశాల ఏర్పాటు కావడం జరిగింది. దీనితో వైద్య సేవలకు దూరమయ్యే పరిస్థితి నుండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయి. ఎట్టకేలకు నాయకుల కృషితో ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది.

ఆదివాసీ తొలి ఐఏఎస్ మడావి తుకారాం



కెరమెరి: అసలే పేదరికం.. ఆపై ఆదివాసీ బిడ్డా.. గ్రామాల్లో సౌకర్యాలు లేవని నిరుత్సాహ పడలేదు..పేదరికం వెంటాడుతున్నా ఆవేదన చెందలేదు..అందుబాటులో ఉన్న అరకొర సదుపాయాలనే తన లక్ష్యానికి మెట్లుగా మార్చుకున్నాడు..ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేశాడు. ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే ఆదివాసీల్లో తొలి ఐఏఎస్ అధికారిగా పేరుగాంచాడు. ఉట్నూర్ మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి చెందిన మడావి తుకారాం. మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి చెందిన మడావి బాపురావ్, మాన్కుబాయి దంపతులకు నలుగురు సంతానంలో మూడో సంతానం మడావి తుకారాం. 1951 జూన్ 4న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోని పాఠశాలలో పూర్తి చేసుకున్న ఆయన ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటిలో డిగ్రీ, పీజీతోపాటు ఉన్నత చదువులు చదివారు. తదనంతరం గ్రూప్-1 సాధించి వివిధ చోట్ల ఆర్డీఓ, సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా ఇలా సుమారు పదిహేనేళ్లపాటు వివిధ హోదాల్లో పని చేసి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి బాటలు వేస్తూ జిల్లాలో తొలి ఆదివాసీ ఐఎఎస్‌గా గుర్తింపు పొందారు. ఉన్న ఊరును కన్న తల్లిగా భావించిన మడావి తుకారాం ఆయన స్వగ్రామంలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. వివిధ అభివృద్ధి పనులు చేశారు. తన పని తీరుతో జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారు. అనంతరం ఆయన అనారోగ్యంతో 29 నవంబర్ 1998లో మరణించారు. నేటికి ఆయన స్ఫూర్తితో ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారు.

పారిశ్రామిక ప్రగతికి ఊతమేదీ..?

- పత్రిపాధనలకే పరిమితమైన కొత్త పరిశమ్రలు
- హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌కు లభించని మోక్షం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పారిశామ్రిక పగ్రతి అటకెక్కుతోంది. కొత్త పరిశమ్రలు రాకపోగా.. పాత వాటి పరిస్థితి పశ్రార్థకంగా మారుతోంది. కేంద, రాష్ట్ర పభ్రుత్వాలు పారిశామ్రిక రంగానికి ఎలాంటి పోత్రాసహకాలు ఇవ్వకపోవడంతో మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అవరోధం కలుగుతుండగా.. ఉపాధి లభించక నిరుద్యోగం పెరిగేందుకు ఆస్కారం ఏర్పడుతోంది. జిల్లాలో అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నా వాటికి అనుబంధ పరిశమ్రలు మాత్రం రావడం లేదు. జాతీయ రహదారి సౌకర్యం ఉండటంతో హౌదరాబాద్- నాగ్‌పూర్ కారిడార్‌ను ఏర్పాటుచేసి అవసరమైన పరిశమ్రలు నెలకొల్పుతామని పభ్రుత్వం హామీనిచ్చినా కేవలం మాటలకే పరిమితమవుతోంది. జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశమ్రల ఏర్టాటుకు అనేక అనుకూలతలు ఉన్నా ఆ దిశగా ముందడుగు పడటం లేదు. ఉమ్మడి జిల్లాలో పాత పరిశమ్రల్లో ఇది వరకే కొన్ని మూతపడగా.. మరికొన్ని అదే బాటలో పయనిస్తున్నాయి. ఇక సిర్పూర్ పేపర్ మిల్(ఎస్పీఎం), జైపూర్‌లో విద్యుత్ ఉత్పత్తి పరిశమ్ర (ఎస్‌టీపీసీఎల్)లు మినహా కొత్త పరిశమ్రలు ల్లాలో నెలకొల్పలేదు. కేవలం ఆయా పరిశమ్రల స్థాపన పత్రిపాధనలకే పరిమితమైందనే పచ్రారం జరుగుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అంతంత మాత్రమే కనిపిస్తోంది. పరిశ్రమల స్థాపనపై అనేక ఆశలు పెట్టుకున్న జిల్లావాసులకు నిరాశ తప్పడం లేదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాతైనా పరిస్థితి మారుతుందని భావించినా ఆశించిన ఫలితం కనిపించడం లేదు. ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మూతపడి దశాబ్ధాలుగా గడిచినా తెరిపించడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం కనబర్చింది. తాజాగా అక్కడి పరికరాలను తుక్కు కింద వేలం వేస్తూ నిర్ణయం తీసుకోవడం జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. వీటితో పాటు మంచిర్యాల ప్రాంతంలో ఉన్న సిరామిక్స్ పరిశ్రమలు సైతం సంక్షోభం దిశగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మూతపడగా..మరికొన్ని అదే బాటలో ఉన్నాయి. జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికీ స్థల సేకరణలోనే అధికారులు నిమగ్నమయ్యారు. నిర్మల్ జిల్లాలో ఆయిల్‌ఫాం పరిశ్రమను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో టమాట పంట అధికంగా సాగవుతున్న దృష్ట్యా దీని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. కానీ ప్రభుత్వ ప్రతిపాధనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

అనుబంధ పరిశ్రమలకు లభించని మోక్షం..!

జిల్లాలో పత్తి, సోయా, టమాట తదితర పంటలు అధికంగా సాగవుతుంటాయి. ముఖ్యంగా ప్రధానంగా పండించే పత్తికి అనుబంధంగా జిన్నింగ్ మిల్లులు అవతరించాయి. ముఖ్యంగా ఇక్కడి పత్తి పంట మేలు రకం కావడంతో వివిధ మార్కెట్లలో మన పత్తికి డిమాండ్ ఉంటుంది. కానీ ప్రభుత్వాల ప్రోత్సాహకాలు లేకపోవడంతో పలు జిన్నింగ్ మిల్లులు మూతపడటం ఆందోళనకరంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 78 జిన్నింగ్ మిల్లులు ఉండగా ఇందులో 27మిల్లులు ఇటీవల మూతపడటం పారిశ్రామిక రంగం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ముఖ్యంగా జిల్లాలో మాంగనీసు, సున్నపురాయి, కోల్ తదితర ఖనిజ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. జిల్లాలో లభించే మాంగనీసు ఖనిజం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం వాటి అనుబంధంగా ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటుచేయడం లేదు. గతంలో టమాట అనుబంధ ఫ్యాక్టరీలను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం హామీనిచ్చినా కార్యరూపం దాల్చడం లేదు. దీంతో రైతులు ఒక్కోసారి టమాటలకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రోడ్లపై పడేయాల్సి వస్తోంది. వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలు లేకుండా పోయాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల మీదుగా హైదరాబాద్- నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం పేర్కొంది. కానీ ఈ ప్రక్రియ కేవలం మాటలకే పరిమితమవుతోంది. ఫలితంగా యువతకు ఉపాధి లేక నిరుద్యోగం మరింత పెరిగేందుకు కారణమవుతోంది. కాగజ్‌నగర్‌లో పేపర్ మిల్లు పున ప్రారంభం జరిగినా.. అందులో స్థానికులకు ఉద్యోగాలు లభించకపోవడంతో వారిలో నిరుత్సాహం ఎదురవుతోంది. జిల్లాలో ఇలా ఒకటి, రెండు పరిశ్రమలు మినహా .. కొత్తగా వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఇప్పటికే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మరింత వెనుకబాటుకు గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు

నవతెలంగాణ-కెరమెరి

పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని అసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడింది. పదేండ్లలో ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికల సమయంలో నాయకులు ప్రగల్బాలు పలికినప్పటికీ రెండు దఫాల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామానికి నేటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయలేదు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించామని చెబుతున్న స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల మాటలు గాలి మాటలేనన్నారు. నేటికీ నియోజకవర్గంలోని పలు మండలాల్లో వాగులపై వంతెనలు లేక ప్రతి యేటా వర్షాకాలంలో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని ఆరోపించారు. వాగులపై వంతెనలు లేకపోవడంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వాగులు నిండుగా ప్రవహిస్తూ, ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగజేస్తున్నాయన్నారు. వాగునీటి ప్రవాహాన్ని దాటలేక మారుమూల గ్రామాల ప్రజలు మండల కేంద్రాలకు చేరుకోలేనటువంటి దుస్థితి నెలకొందన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి వంతెన పనులు తొమ్మిదేండ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నేటికీ పూర్తి కాకపోవడంతో గుండె పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి రాలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రతి యేటా వర్షాలకు కుమురం భీం ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో గుండివాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. కొన్ని సందర్భాల్లో అత్యవసరమైన పనులు ఉన్నప్పుడు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రమాదకరంగా పడవ ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. కెరమెరి మండలంలో అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై 2016 నుంచి వంతెన పనులు కొనసాగుతున్నాయి. నేటికీ పూర్తికాలేదు. దీంతో సుమారు 20 గ్రామాల ప్రజలు వర్షాకాలంలో మండల కేంద్రానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కేజీ టూ పీజీ విద్య అన్న ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయలేదని తెలిపారు. అదేవిధంగా నేటికీ ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక ప్రతి యేటా పిల్లల సంఖ్య పడిపోతోందన్నారు. ప్రభుత్వం ఒకటి నుంచి ఐదు తరగతి విద్యార్థులకు ఒకే ఒక ఉపాధ్యాయుని నియమించడంతో విద్యాబోధన కుంటుపడుతోందన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ప్రతిరోజు వచ్చే రోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పాటైతే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పినా అమలుకు నోచుకోలేదన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం...

రైతు, యూత్ డిక్లరేషన్‌పై ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరిస్తామని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షల సాయం, కౌలు రైతులకు



రైతుబంధు ఎకరాకు రూ.15వేలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదికే 2లక్షల ఉద్యోగాలు భర్తీకి కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగులకు రూ.4వేల నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతికి చరమగీతం పాడాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా...

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మారాం నాయక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజకీయాల్లో సక్సెస్ కావాలంటే పార్టీల తరఫున బీఫామ్ రావడంతో పాటు ప్రజలు కూడా ఆదరించాల్సి ఉంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మారాం నాయక్ అన్నారు. మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. సింగరేణి ప్రాంతంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని అయితే అటువంటివేవి జిల్లాలో జరగడం లేదన్నారు. వీటిపై నాయకులు ఎక్కడ కూడా మాట్లాడిన దాఖలాలు లేవని తెలిపారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలకు కనెక్టివిటీ లేదని, తిర్యాణి మండలంలో మంగి, గుండాల లాంటి ప్రాంతాలే దీనికి నిదర్శనమని తెలిపారు. తనకు అవకాశం ఇస్తే లక్మాపూర్ వంతెనతో పాటు లింగాపూర్ నుండి లొద్దిగూడ మీదుగా ఆసిఫాబాద్ వరకు రహదారి నిర్మాణంతో పాటు అటు మంచిర్యాల జిల్లా జన్నారం వరకు రహదారి నిర్మిస్తానని తెలిపారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నాయకులు కృషి చేయకపోవడం బాధ కలిగించిందన్నారు. నియోజకవర్గంలో అనేకమంది యువత చదువుకుని నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతుందని ఇదే సందర్భంలో 70 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న బీసీ, ఎస్సీ, మైనారిటీలు ఇతర వర్గాల ప్రజల హక్కులు గాలికి వదిలేసిందన్నారు. గిరిజనుల హక్కుల రక్షణతో పాటు ఇతర వర్గాల బాధలు కూడా ప్రభుత్వం అర్థం చేసుకుంటే కొంత బాగుండేదని సూచించారు. నియోజకవర్గంలో సాగునీటి వసతి అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



దీనికోసం నార్నూర్ మండలంలో సుంగాపూర్ ప్రాజెక్ట్, గాదిగూడ మండలాల్లో ప్రాజెక్టులు నిర్మిస్తామన్నారు. అడ, వట్టివాగు ప్రాజెక్టుల 70వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ కనీసం 2వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఆదివాసులు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. జైనూరు మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. కులాల పేరుతో కొట్లాట పెట్టి అధికారం ఆకాంక్షించే అలవాటు లేదని, అన్ని కులాలను ఒకే రకంగా చూస్తానని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో కరెంటు లేని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందించడంతో పాటు 80 గ్రామాలకు సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని అన్నారు. 236 గ్రామాలకు రవాణా మార్గం కల్పిస్తామని తెలిపారు. ఎన్నికలు రాగానే ఇతర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తమ పార్టీ మైనారిటీలకు వ్యతిరేకం కాదని వారికోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ఇప్పటికే మైనార్టీ మహిళలకు గుదిబండగా మారిన త్రిబుల్ తలాక్ రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. యూసీసీ కూడా వారి కుటుంబ వ్యవస్థను సరి చేస్తుందన్నారు. గడిచిన 9 సంవత్సరాల్లో ఒకసారి బీఆర్ఎస్ పార్టీకి, రెండోసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని ప్రస్తుతం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమస్యలపై సైనికుడిలా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజా తీర్పును శిరసావహించానని తెలిపారు. ఓటమి నుండి పాఠాలు నేర్చుకుని ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నానని తెలిపారు. పార్టీ టికెట్ తనకే వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నానని, ఒకవేళ అది జరగని పరిస్థితుల్లో పార్టీ విధానాలకు కట్టుబడి పని చేస్తానని పునరుద్ఘాటించారు.

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ రాజలింగం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్, కలెక్టర్ అదేశానుసారం గ్రామాల్లో జనాబా లెక్కల ప్రకారం ఓటర్లు తక్కువ శాతం ఉన్నందున గ్రామంలోని ప్రతి ఒక సర్పంచులు పంచాయతి కార్యదర్శి సంభందిత బూత్ లెవెల్ అధికారులు అందరు వివిధ గ్రామాలలో ఈనెల 21 నుండి 27 వరకు ఏడు రోజుల పాటు ఎవరైతే ఓటు హాక్కు కలిగి ఉండి వారి పేరును నమోదు చేయలేదో వారి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారి వద్ద ఉన్న ఫారం నెంబర్ 6 ద్వారా ఓటు హాక్కులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆదివాసీ జిల్లా.. అందాల ఖిల్లా..

- మనసు పెడితే మదిని దోచే అందాలు
- జిల్లాకు పెరిగిన పర్యాటకుల తాకిడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పచ్చటి స్వచ్ఛమైన వాతావరణాన్ని, ఆహ్లాదాన్ని కోరుకుని మనిషి ఉండడనేది అందరికీ తెలిసిన విషయమే. అటువంటి ప్రకృతి అందాలు, ఆహ్లాద వాతావరణం, కల్మషం లేని ఆదివాసులు జిల్లా సొంతం. ప్రకృతి అందాల అభివృద్ధి కోసం నాయకులు కాసింత మనసు పెడితే ఇప్పటికే జిల్లాకు తరలివస్తున్న పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆదివాసీ జిల్లా.. ప్రకృతి అందాల ఖిల్లా..

చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం మధ్యలో జలపాతం అక్కడికి వెళితే ఆఫ్రికా ప్రాంతంలో ఉన్న అనుభూతి ఇదంతా నియోజకవర్గం సొంతం. నియోజకవర్గంలోని అనేక జలపాతాలు ప్రకృతి అందాలకు నిలయాలుగా నిలుస్తున్నాయి. తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట, చింతలమాదరం, వాంకిడి మండలంలోని సర్కెపల్లి, సిర్పూర్(యు) మండలంలోని మిట్టే జలపాతం లేదా సప్త గుండాల, అసిఫాబాద్ మండలంలోని సమతులగుండం జలపాతాలు ప్రకృతి అందాలుగా నిలుస్తున్నాయి. వీటితో పాటు మానవ నిర్మితమైన సింగరేణి నియోజకవర్గంలో ఆకర్షణగా నిలుస్తుంది.

మనసు పెడితే మదిని దోచే అందాలు...

నాయకులు కొద్దిగా మనసు పెడితే మదిని దోచే అందాలకు నియోజకవర్గంలో కొదవేలేదు. తిర్యాణి, వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో దట్టమైన అటవీ ప్రాంతాలు ఉన్నాయి. వీటిని పర్యాటకంగా మలచడానికి అవసరమైన నిధులు కేటాయిస్తే అవి మదిని దోచే అందాలుగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. జలపాతాల వద్ద కూడా మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లయితే పర్యాటకులకు కొంత సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఇప్పటికే సమతుల గుండం ప్రాంతాన్ని సందర్శించి, పర్యాటక అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు చేపట్టాలని విషయాన్ని అధికారులకు తెలియజేశారు.

రోజురోజుకూ పెరుగుతున్న పర్యాటకులు..

గతంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న సమయంలో ఆసిఫాబాద్ జిల్లాకు కొత్తవారు ఎవరు రావడానికి ఇష్టపడేవారు కాదు. జిల్లా ఆవిర్భావం తర్వాత అనేక మార్పులు చోటుచేసుకుని అటవీ అందాలు బయటకు వచ్చాయి. దీంతో పక్కనే ఉన్న మహారాష్ట్రతో పాటు మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల నుంచి అనేక మంది పర్యాటకులు జిల్లాలోని ప్రకృతి అందాలను వీక్షించడానికి వస్తున్నారు. గతంలో అడ ప్రాజెక్టు వద్ద, బెజ్జూర్ మండలంలోని ప్రాణహిత పరివాహక ప్రాంతంలో రాబందుల గుట్ట ప్రాంతాల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్ అటవీశాఖ అధికారులు నిర్వహించినప్పుడు వందలాదిమంది జిల్లాకు వచ్చిన విషయం తెలిసిందే. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల జిల్లాలో పర్యాటకుల తాకిడి పెరగడంతో పాటు ప్రజల ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదపడుతుంది.



పోడుకు మోక్షం..ఆదివాసుల్లో హర్షం..!

- హక్కుపత్రాల జారీతో లబ్ధిదారుల్లో ఆనందం
- ఏండ్ల నాటి సమస్యకు లభించిన పరిష్కారం
- ఉమ్మడి జిల్లాలో 37,401మందికి ప్రయోజనం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా మిగిలిపోయిన పోడు భూముల సమస్యకు పరిష్కారం లభించింది. పోడు భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసులకు ఆ భూమిపై హక్కులు లభించాయి. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటకు వచ్చిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ ప్రక్రియను ఇక్కడ్నుంచే ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలో అర్హులైన గిరిజనులు 37,401మందికి పోడుపట్టాలు జారీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటిని వారం రోజుల్లో ఆయా మండలాల వారీగా అధికారులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. హక్కుపత్రాలు పొందిన వారికి ప్రభుత్వం తొలి విడత పెట్టుబడి సాయం అందజేస్తామని కూడా ప్రకటించింది. దీంతో ఏండ్లుగా పోడు పట్టాల కోసం పోరాడుతున్న గిరిజనుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపించడం లబ్దిదారుల్లో ఆనందం నింపింది.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూముల అంశం ప్రధానంగా ఉండేది. అనేక మంది ఆదివాసీ గిరిజనులు వారి తాతముత్తాతల కాలం నుంచి అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కానీ సంబంధిత భూములకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం పొందలేకపోయారు. బ్యాంకు రుణాలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమాతో పాటు పంట కొనుగోళు ..అమ్మకాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూములు దున్నడం..పంటలు పండించేది వారేనైనా హక్కుపత్రం లేకపోవడంతో ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమయ్యారు. దీంతో పోడు భూములకు పట్టాలు జారీ చేయాలని అనేక ఏండ్లుగా ఉద్యమించారు. గిరిజన సంఘాలతో పాటు ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు వీరికి బాసటగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హక్కుపత్రాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారు. కానీ కాలయాపన జరగడంతో ఆదివాసీ గిరిజన సంఘాలు, గిరిజనులు పలుమార్లు ఉద్యమాలు చేపట్టారు. అనేకసార్లు గిరిజన సాగుదారులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణలు నిత్యకృత్యమయ్యేవి. ఈ ఘర్షణల్లో పలువురు ఆదివాసీ గిరిజనులు జైలుకు వెళ్లిన సందర్భాలు ఉండగా.. అటవీ అధికారులకు గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజాగా కిందటి నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన లబ్దిదారులకు హక్కుపత్రాలు పంపిణీ చేయడంతో ఏండ్ల నాటి సమస్యకు పరిష్కారం లభించింది.

ఉమ్మడి జిల్లాలో 37,401మందికి లబ్ది

ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం పోడు భూములకు హక్కుపత్రాలు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 37,401మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వం జిల్లాలో 1,03,896 ఎకరాలకు హక్కుపత్రాలు జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 31,683 ఎకరాలకు గాను 12,222మందికి హక్కుపత్రాలు జారీ చేయగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 47,138 ఎకరాలకు గాను 15,519మందికి, నిర్మల్ జిల్లాలో 20,051 ఎకరాలకు గాను 7257మందికి, మంచిర్యాల జిల్లాలో 5024 ఎకరాలకు 2403మందికి హక్కుపత్రాలు జారీ చేశారు. త్వరలోనే వీరికి రైతుబంధు డబ్బులు కూడా ఖాతాల్లో జమ కానున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు గిరిజన లబ్ధిదారులకు దక్కనుండటంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

స్వరాష్ట్రంలో కుమురం భీంకు గుర్తింపు

- అభివృద్ధి దిశగా జోడేఘాట్
- రూ.25 కోట్లతో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు



నవతెలంగాణ-కెరమెరి


జోడేఘాట్ గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గిరిజన పోరాట యోధుడు కుమురం భీం పోరాట ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం జోడేఘాట్‌తో పాటు కొండలపై ఉన్న పరిసర గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఆదివాసుల ఆరాధ్యదైవం పోరాట వీరుడు కొమురం భీం పోరుగడ్డను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని ప్రస్తుత ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీ మేరకు 2014లో కుమురం భీం వర్ధంతి బహిరంగ సభలో పాల్గొన్నారు. జోడేఘాట్‌లో భీం మ్యూజియం, స్మారక చిహ్నం ఏర్పాటుకు రూ.25కోట్లు మంజూరు చేశారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రూ.15.70కోట్లతో డబుల్ లైన్ రోడ్డు వేశారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఏ ముఖ్యమంత్రి సైతం ఆదివాసుల పోరుగడ్డను పట్టించుకోకపోగా, పోరుగడ్డను సందర్శించిన మొట్టమొదటి ముఖ్యమంత్రిగా చంద్రశేఖర్‌రావు గుర్తింపు పొందారు. అదేవిధంగా రూ.2.95కోట్లతో ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను పూర్తి చేశారు. గతంలో పోరు గ్రామాల ప్రజలు తాగునీటికి కోసం అనేక ఇబ్బందులు పడేవారు. శుద్ధ జలం అందుబాటులో లేక పురాతన బావులు, కాల్వలు, చెలిమెల నీటిని తాగునీటిగా వినియోగించేవారు. దీంతో ఆదివాసీ గిరిజనులు అనేక వ్యాధుల బారిన పడేవారు. ప్రస్తుతం జోడేఘాట్‌తో పాటు చుట్టుపక్కల 11 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పోరు గ్రామాల్లో అంతర్గత రోడ్లు లేక వర్షాకాలంలో ప్రజలు బురదలో అనేక తిప్పలు పడేవారు. గతేడాది క్రితం వరకు దాదాపు పోరు గ్రామాలలో అంతర్గత రహదారులను మెరుగుపరిచారు. గిరిజన ఆవాసాల్లోని ప్రతి వీధిలో సిమెంట్, కాంక్రీట్ (సీసీ) రోడ్లు వేశారు. మరోవైపు గిరిజన ఆవాసాల్లో నిరంతర విద్యుత్ అందిస్తున్నారు. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ సహకారంతో రైతులకు ప్రతి ఏడాది భీం వర్ధంతి రోజున వ్యవసాయ రంగంలో తోడ్పాటును అందించేందుకు ఎద్దుల జతలు, ఎద్దుల బండ్లను ప్రభుత్వం అందించింది. 2014 నుంచి జోడేఘాట్‌తోపాటు చుట్టుపక్కల మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జోడేఘాట్, పాట్నాపూర్, చిన్నపట్నాపూర్, కోలాంగూడ, శివగూడ, టోకెన్‌మోవాడ్, బాభేజారి, చాల్‌బడి, పాటగూడ, కోపగూడ, పిట్టగూడ, లైన్‌పటార్ గ్రామాల వాసులు మండల కేంద్రానికి చేరుకోవడానికి నానా తంటాలు పడేవారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రం నుండి పోరు గ్రామాలకు ఎలాంటి రవాణా సౌకర్యం ఉండేది కాదు. దీంతో అత్యవసర సమయాల్లో గర్భిణులను అనారోగ్యాల బారిన పడిన వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఆదివాసీ గిరిజనులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడేది. ప్రస్తుతం కెరమెరి ప్రధాన రహదారి హట్టి నుండి జోడేఘాట్ వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో పోరు గ్రామాల ప్రజలకు రాకపోకలకు సౌకర్యవంతంగా మారింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుండి ఏడాది క్రితం వరకు రెండు పూటలా ఉదయం సాయంత్రం ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు పోరు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దీంతో రవాణా కష్టాలు తీరాయని పరిసర గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు

జోడేఘాట్‌కు 20డబుల్ బెడ్ రూమ్ గృహాలు..

పోరుగడ్డ జోడేఘాట్‌లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు పక్కా ఇండ్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 20 డబుల్ బెడ్‌రూమ్ గృహాలను మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని డబుల్ బెడ్ రూమ్ గృహాలు పూర్తికాగా, మరి కొంతమంది గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. డబుల్ బెడ్ రూమ్ గృహాలు పూర్తయితే, తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యంతో పాటు విద్యార్థులకు శాటిలైట్ ఆశ్రమ పాఠశాల, గ్రామాల్లో అంతర్గత రోడ్ల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. ఆదివాసుల హక్కుల కోసం నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించిన పోరుగడ్డ ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఆదరణకు నోచుకోలేదు. స్వరాష్ట్రంలో ఆదివాసుల పోరాట వీరునికి అరుదైన గుర్తింపు నిచ్చింది. జోడేఘాట్‌లో ట్రైబల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందింది.

నవతెలంగాణ

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



ఆసిఫాబాద్: రాజకీయాల్లో రాణించాలంటే ఎంతో చతురత ఉండాలి. దానితో పాటు అదృష్టం కావాలి. కష్టపడాలి. ఇవన్నీ చేసినప్పటికీ అధికారం రావాలంటే ప్రజల మన్ననలు పొందాలి. ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ బాధ్యతలను భుజాల మీద మోస్తూ గత ఎన్నికల్లో రాష్ట్ర ఫలితాలకు భిన్నంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడానికి అహర్నిశలు కృషి చేయడంతో పాటు రానున్న ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని చెబుతున్నారు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్. నవతెలంగాణ వెలువరిస్తున్న మన నియోజకవర్గం ప్రత్యేక సంచిక సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. తెలంగాణ ఉద్యమ నినాదం నీళ్ళు, నిధులు, నియామకాల లక్ష్యం చేరుకోలేదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో 80శాతం కుమురం భీం ప్రాజెక్టు పూర్తి చేశామని, మిగతా 20 శాతం పూర్తి చేయడంలో అధికార పార్టీ విఫలమైందన్నారు. వట్టివాగు ప్రాజెక్టుకు సంబంధించి సింగరేణితో ఇరిగేషన్ అధికారులతో ఒప్పందం చేయించామని, దీని ప్రకారం ఎప్పటికప్పుడు సిల్ట్ రిమూవల్ చేయాల్సి ఉంటుందన్నారు. కానీ ప్రస్తుతం అదేదీ జరగక ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టును ఆధునీకరిస్తామన్నారు. వైద్య రంగానికి సంబంధించి మెడికల్ కళాశాల స్థాపించామని గొప్పలు చెబుతున్న నాయకులు ఆదిలాబాద్‌లో తాము స్థాపించిన రిమ్స్‌లో పూర్తిస్థాయి డాక్టర్లను, సిబ్బందిని ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి మండలంలో కళాశాల ఏర్పాటు చేశామని, వాటికి కనీసం అదనపు తరగతి గదులు కూడా నిర్మించలేకపోయారని అన్నారు. జిల్లాలో 200పైగా పాఠశాలలకు గతంలో వివిధ రకాల నిధులతో అదనపు తరగతి గదులు నిర్మించినట్లు వివరించారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రహదారులు కూడా నిర్మించలేకపోయారన్నారు. వాంకిడి మండలంలోని సామెల, కిరిడి, సరండి, తేజగూడ గ్రామాల్లో విద్యార్థులు నేటికీ పాఠశాలలకు వెళ్లడానికి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ నుండి గెలిచి ప్రజలను, పార్టీని మోసం చేసి ఇతర పార్టీలోకి ఎమ్మెల్యే వెళ్లిపోయాడని, ప్రస్తుతం అలా జరగకుండా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నుండి బాండ్ పేపర్‌పై హామీ పత్రం తీసుకుంటున్నట్లు తెలిపారు. సింగరేణిలో స్థానికులకు గతంలో ప్రాధాన్యత కల్పించామని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కోల్ ఇండియా వేజ్ బోర్డు ప్రకారం 26 మస్టర్లు చేసిన కార్మికులకు రూ.19000 చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం రూ.15వేలకు పరిమితం చేశారన్నారు. అధికార పార్టీ నాయకులకు ఇవేవీ కనిపించడం లేదని ఆరోపించారు. పార్టీలో ఏ అభ్యర్థి పట్ల తనకు ప్రేమ లేదని, అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావుతో ఎటువంటి విభేదాలు లేవని, జిల్లాలో అభ్యర్థుల గెలుపు కోసం ఆయనతో కలిసి పని చేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న తరుణంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 21 ఆగస్టు 2023

రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, చిలుకూరి లక్ష్మారెడ్డి అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని మాజీ మంత్రి నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. నేటి యువతీ యువకులకు రాజీవ్‌గాంధీ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.



ప్రజాగాయకుడు గద్దర్‌కు ఘన నివాళి

కాసిపేట : మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం ప్రజా గాయకుడు గద్దర్‌కు కాసిపేట ప్రెస్‌క్లబ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ప్రజల కోసం ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేసి కొనియాడారు. అనంతరం కళాకారులు తమ ఆట పాటలతో గద్దర్ జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పల్లె మల్లయ్య, సిలోజ మురళి, చిన్న భీమయ్య, కొమ్ముల బాపు, గోనెల శ్రీనివాస్, దుర్గం గోపాల్, వాసేవ్, కళాకారులు గొడిశెల బాపు, కృష్ణ, కిషన్, రాజన్న, ప్రెస్ క్లబ్ సభ్యులు రవిరాజ్, రాజేష్, తిరుపతి, నజీర్, రమేశ్ కుమార్, శ్రీధర్, అనిల్, మోతీరాం పాల్గొన్నారు.



హామీలను విస్మరించిన బీజేపీ, కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతిపక్ష పార్టీలలో టికెట్ల కోసం వర్గపోరు కొనసాగుతుంటే బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా వచ్చి ప్రజలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిరాణా అండ్ జనరల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పార్టీలో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదేండ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర అభివృద్ధే అందుకు కారణమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గతంలో పాలించినప్పటికీ ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యాయని అన్నారు. ఇప్పటికీ ఆ పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని అన్నారు. ఇదే సమయంలో సమగ్ర అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. తొమ్మిదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలోకి చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు వర్గపోరులో కొట్టుమిట్టాడుతుంటే బీఆర్ఎస్ అభివృద్ధి పథాన దూసుకెళ్తోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మహిళా అధ్యక్షురాలు, స్వరూపరాణి, నాయకులు సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో ఆదివారం పేదల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని గైనకాలజిస్ట్ వైద్యురాలు విజయలక్ష్మి, గ్రామసర్పంచ్ సంతోష్‌రెడ్డి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ వద్దకు 224 మంది పేషంట్స్ వచ్చారని, పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆమె వెంట డాక్టర్ కపిల్ జనరల్ సర్జన్ ఉన్నారు.

మంచం పట్టిన శంకర్‌గూడ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని శంకర్‌గూడలో వైరల్ జ్వరాలతో ఇంటికొక్కరు మంచాన బారిన పడ్డారు. శంకర్‌గూడలోని జాయేభాయే వందన(40), దత్త కేంద్రే(45), నారాయణ్(40), శ్లోక్(8), పింకు(30), రాజు(35), మాయ(34), రవితో పాటు అనేక మంది జ్వరాలతో విలవిల లాడతున్నారు. సర్కారు దవాఖానలో వైద్యులు అందుబాటులో ఉండక ప్రయివేట్ ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రయివేట్ వైద్యులు అవసరం లేకున్న సలైన్‌లను ఎక్కించి, అందినకాడికి దండుకుంటున్నారు. సర్కారీ వైద్యులు ఒక్కో రోజుకు ప్రయివేటుకు వెళితే రూ.1000 వరకు బిల్లులు చేస్తున్నారు. ప్రతిరోజు కూలీనాలీ చేసుకునేవారు, పేదవారు అప్పులు చేసి మరి ప్రయివేట్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. సర్కారీ వైద్యులు కేవలం ఒంటిపూట మాత్రమే అందుబాటులో ఉండటంతో అనేక మంది ఆస్పత్రికి వెళ్లి మండల కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. శంకర్‌గూడలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మాస్టర్ ప్లాన్ రద్దు కావాలని ప్రత్యేక పూజలు



దిలావర్‌పూర్ : మాస్టర్ ప్లాన్ రద్దు చేసే విధంగా స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణరెడ్డికి సోయి వచ్చేలా చేయమని దిలావర్‌పూర్ మండల బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఏకనాథ స్వామి ఆలయంలో శివునికి అభిషేకాది పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బీజేపీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గత ఐదు రోజుల నుండి నిర్వహిస్తున్న ఆమరణ నిరాహార దీక్ష సత్ఫలితాలనివ్వాలని, అతను ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోయే ఎన్నికల్లో దిగ్విజయం సాధించాలని ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు జక్కుల వీరేష్, సబ్బని మురళి, వడ్ల పండరి, పీసరి ప్రవీణ్, జంగం సాయినాథ్, సంబు బోజారాం పటేల్ పాల్గొన్నారు.

'పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్‌టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులపై లాఠీ చార్జిని ఖండిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల భూదందా కోసం తీసుకువచ్చిన 220 జీఓను వెంటనే రద్దు చేయాలని, మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా మాస్టర్ ప్లాన్ రద్దు అయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు.

ఇంటర్ అడ్మిషన్లలో 'శతక్కొట్టిన' ప్రభుత్వ కళాశాలలు

- ప్రభుత్వ కళాశాలల్లో భారీగా విద్యార్థుల చేరికలు
- ఫలితాల్లో మేటి.. ప్రవేశాల్లో సాటి..
- సరళమైన అడ్మిషన్ ప్రక్రియే కారణమా?

ప్రభుత్వ కళాశాల్లో విద్యార్థులు చేరడానికి అయిష్టత చూపుతున్న వేళ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా మిగతా జిల్లాలకు దీటుగా అనుకున్న లక్ష్యాన్ని సాధించి శతశాతం అడ్మిషన్ల దిశగా దూసుకెళ్తోంది. వెనుకబడిన జిల్లాగా పేరొందిన కుమురం భీమ్ జిల్లా ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియలో మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందనదనంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్‌లను రెగ్యులరైజ్ చేయడంతో అడ్మిషన్లు తగ్గుతాయని కొంతమంది భావించినప్పటికీ వారు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకున్నారు.



రెబ్బెన కళాశాల పరిధిలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ అడ్మిషన్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జిల్లా 100 శాతంతో దూసుకెళ్తోంది. జిల్లాలో మొత్తం 48 కళాశాలలుండగా 5843 విద్యార్థులు అడ్మిషన్లు ఉన్నాయి. ప్రైవేట్ విభాగంలో ఐదు జూనియర్ కళాశాలల్లో 1028 అడ్మిషన్లు కాగా ప్రభుత్వ యాజమాన్యాల కింద నడిచే కళాశాలలు 32 ఉండగా వీటిలో 2017 అడ్మిషన్లు అయ్యాయి. వీటన్నింటికీ దీటుగా జిల్లా వ్యాప్తంగా 11 జూనియర్ కళాశాలలో 2800 అడ్మిషన్లు పూర్తి చేసి 99శాతం లక్ష్యాన్ని చేరారు. 2021-22 విద్యా సంవత్సరానికి 2514 అడ్మిషన్లు కాగా 2022-23 విద్యా సంవత్సరానికి 2562 అడ్మిషన్లు అయ్యాయి. వాటిని అధిగమిస్తూ ప్రస్తుత విద్య సంవత్సరం 2800 అడ్మిషన్లు పూర్తి చేసుకున్నారు.

జైనూర్ కళాశాలలో 160 శాతం మంది చేరిక

జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 శాతం చేరువగా అడ్మిషన్లు కాగా కొన్ని కళాశాలలో 100 శాతం దాటింది. జైనూర్ కళాశాలలో మంజూరు సంఖ్య 176 ఉండగా ఇప్పటికే 281 మంది అడ్మిషన్ పొంది 160కి చేరుకుంది. ఆసిఫాబాద్‌లో 334కుగాను 414, వాంకిడిలో 176కు 201మంది, సిర్పూర్(టి)లో 176కు గాను 183 మంది, కౌటాలలో 325కు గాను 326 మంది అడ్మిషన్ పొంది 100 శాతం దాటాయి. మిగతా కళాశాలలు 100 శాతానికి అత్యంత చేరువులో ఉన్నాయి.

సత్ఫలితాలిచ్చిన 'ఇంటింటా ఇంటర్ అడ్మిషన్లు

అడ్మిషన్ల సందర్భంగా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాల సిబ్బంది ఇంటింటా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ పేరుతో కళాశాల పరిసర గ్రామాల్లో ప్రతి విద్యార్థిని కలిసే ప్రయత్నం చేశారు. దీంతో విద్యార్థుల ఆలోచన విధానం మార్చగలిగారు. లెక్చరర్లు బాధ్యతగా వ్యవహరిస్తూ విద్యార్థులను మెప్పించడంలో విజయం సాధించారనడంలో ఎలాంటి సందేహం లేదు. జిల్లాలో ఇంటింటా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ సత్ఫలితాలను ఇచ్చిందనడంలో సందేహం లేదు.

అడ్మిషన్లు పెంపుకు కారణాలివే...

ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల జోరు కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించడం కూడా అడ్మిషన్లు పెంపుకు కారణమైంది. అడ్మిషన్ కోసం విద్యార్థుల నుండి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా అడ్మిషన్ ఇవ్వడం, విద్యార్థుల ఇంటి వద్దకే ఇంటర్ అడ్మిషన్లు అని చేపట్టడం, ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధన, ఎప్పటికప్పుడు బోధన, పరీక్షలకు సన్నద్ధతపై దృష్టి సారింపు లాంటివి అడ్మిషన్లు పెంపుకు కారణాలుగా నిలుస్తున్నాయి.

'శత శాతం'అడ్మిషన్లు గర్వకారణం : శ్రీధర్ సుమన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి



జిల్లాలో నిర్దేశించిన అడ్మిషన్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాధించడం గర్వకారణంగా ఉంది. దీంట్లో అధ్యాపకుల కృషి ఎంతగానో ఉంది. ఇంటింటా ఇంటర్ అడ్మిషన్ల పేరుతో అధ్యాపకులు పదవ తరగతి పూర్తయిన విద్యార్థులను పెద్ద ఎత్తున కలవడంతో అడ్మిషన్లు పెరిగాయి. శత శాతం అడ్మిషన్లు సాధించడం గొప్ప విజయం.

మంత్రి తలసాని నిర్వాకంపై

బైంసాలో అట్టుడికిన ఆందోళనలు

- బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్‌పై చేయి చేసుకున్న తలసాని
- అంతటా ఆందోళనలు

నవతెలంగాణ-భైంసా

హైదరాబాద్‌లో శనివారం స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ వెంట ఉన్న భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబుపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొక్కా పట్టుకుని చెంపపై కొట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆదివారం భైంసాతో పాటు పలు గ్రామాల్లో నిరసనలు చేపట్టారు. తమ కాలం నుండి ఉన్న నాయకుడిని ఇలా అవమానిస్తారా అంటూ మండిపడ్డారు. పార్టీలకతీతంగా జరిగిన ఘటనను ఖండించారు. పుస్పూర్ గ్రామం నుండి గిరిజనులు, గ్రామస్తులు పెద్ద మొత్తంలో భైంసాకు చేరుకొని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దిష్టిబొమ్మతో శవయాత్ర చేపట్టారు. అనంతరం బస్టాండ్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మంత్రి తలసానికి కండకావరమా, మా నాయకుడిని అవమానిస్తారా? అంటూ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రభుత్వ ఉద్యోగం వదిలి, ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ నాయకుడిని అవమానించడం సరికాదన్నారు. మంత్రిని తక్షణమే భర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై క్షమాపణ చెప్పకపోతే ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఆందోళన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగామణి, మాజీ ఎంపీటిసి సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లాలుయాదవ్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బలిరాం, యువ నాయకులు సుధాకర్, శ్యామ్‌రావు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.







బీజేపీ నిరసనలో ఉద్రిక్తత..పోలీసుల లాఠీచార్జి

- పోలీసులు జోగు రామన్న తొత్తులు
- లాఠీచార్జిని ఖండిస్తున్నాం : బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసులు జోగు రామన్న తొత్తులుగా, గూండాలుగా తమపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. నిర్మల్‌లో బీజేపీ నాయకులపై పోలీసుల దాడిని ఖండిస్తూ జిల్లా కేంద్రంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురికి వాగ్వాదం, తోపులాట జరుగగా ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు నాయకులపై లాఠీచార్జి చేశారు. పాయల్ శంకర్‌కు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎలక్షన్లకు మూడు నెలల సమయం ఉండగానే పోలీసుల వ్యవహార శైలి ఇంతలా ఉంటే ఎలక్షన్ల సమయంలో ఆదిలాబాద్ ప్రజలకు రక్షణ ఎవరని ప్రశ్నించారు. రక్షణ ఇవ్వాల్సిన పోలీసులే దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన సొంత ఆస్తులను పెంచుకోవడానికి నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్ తెరపైకి తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అవినీతి, అక్రమం జరిగినా దాన్ని అడ్డుకోవడంలో బీజేపీ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కారణంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు ఎక్కడ తనను ముంచుతాయో అని బిజెపి కార్యకర్తల చేతులు కాళ్ళు విరిగే విధంగా గూండాలాగా దాడి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలా మున్న, రఘుపతి, నగేష్ అంకత్ రమేష్, లోక ప్రవీణ్‌రెడ్డి, ఆకుల ప్రవీణ్, జోగు రవి, సోమ రవి, మహేందర్, చిలుకూరి జ్యోతిరెడ్డి, దినేష్ మాటోలియా, రాళ్లబండి మహేందర్, రత్నాకర్‌రెడ్డి, శివ, సురేందర్, సూర్య పాల్గొన్నారు.



కండ్లకు గంతలతో రెండో ఏఎన్ఎంల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా యధావిధిగా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్ఏంలు తెలంగాణ యూనిటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. కాగా ఆదివారంతో ఈ సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమ్మె శిబిరంలో కండ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. సమ్మె చేపట్టి ఆరు రోజులు గడుస్తున్నా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె కనపడడం లేదా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాయకులు పుష్పాల, లలిత, విజయలక్ష్మి, ఆనంద బాయి, సవిత్రా, మణిలత, మమత పాల్గొన్నారు.

మంచిర్యాల అసెంబ్లీ టికెట్టు బీసీ అభ్యర్థికే ఇవ్వాలి

- బీసీ ఐక్యవేదిక నాయకుల డిమాండ్



నవతెలంగాణ-హాజీపూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో మెజార్టీ వర్గమైన బీసీ సమాజం నుండి అభ్యర్థులనే అన్ని పార్టీలు తమ తరఫున నిలబెట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన బీసీ ఐక్య వేదిక సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గంలో 80 శాతం వరకు బీసీ ప్రజలే ఉన్నారని, మెజార్టీ ప్రజల ఆకాంక్షల మేరకు బీసీ అభ్యర్థిని పార్టీలు నిలబెట్టాలని వారు డిమాండ్ చేశారు. మెజారిటీ అభిప్రాయానికి తలొగ్గడమే ప్రజాస్వామ్య లక్షణమని తెలిపారు. ఇన్ని రోజులుగా అన్ని పార్టీలు అగ్రకులాలకు చెందిన వారినే నిలబెడుతున్నాయని, రాజ్యాంగం ప్రవచిస్తున్న సామాజిక న్యాయానికి ఇది విరుద్ధమని తెలిపారు. బీసీ వర్గాల నుండి సమర్థులైన అభ్యర్థులు ఎంతో మంది ఉన్నారని, ఆయా పార్టీలు తమకు న్యాయం చేయని యెడల బీసీ అభ్యర్థిని ఇండిపెండెంట్‌గా నిలబెట్టుకుని గెలిపించుకుంటామని వారు పార్టీలను హెచ్చరించారు. బీసీ అభ్యర్థిని గెలిపించుకునే దిశలో ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణ, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, తులా మధుసూధన్, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, బీసీ నాయకులు మొగిళి తిరుపతి, బండి రాజలింగు, ప్రదీప్ కుమార్, సోమయ్య భూమన్న పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

కొలాం ప్రజలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని కొలాం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకం భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని హస్నాపూర్‌లో ఉమ్మడి కొలాం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కొలాం ప్రజలు ఐక్యంగా ఉండి మన హక్కులు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఆదివాసీ 9తెగలను విచ్ఛిన్నం చేయడానికి తుడుందెబ్బ ఒక వర్గం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఆదివాసీ కొలాం సమాజం విచ్ఛిన్న విషయాన్ని గమనించి ఏ తెగపై కూడ అనుచిత వాఖ్యలు చేయకుండా సమన్వయం పాటించాలని అన్నారు. ప్రస్తుతం వర్షకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, గ్రామాల్లోని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొలాంలు చదువుపై దృష్టి సారించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఇటీవల కొలాం నాయకుడు సోనేరావ్‌పై దాడి చేసి వారం రోజులు అయిన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన బాధితులను గుర్తించి శిక్షంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కొలాం సంఘం రాష్ట్ర కార్యదర్శి టేకం వసంత్, ఐటీడీఏ డైరెక్టర్‌లు ఆత్రం లక్ష్మణ్, ఆత్రం భీంరావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం లక్ష్మణ్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆత్రం గంగారామ్, రాజు, మండల అధ్యక్షులు బాపురావ్, నాయకులు ఉన్నారు.

ఆలయ శిఖర జీర్ణోద్ధరణ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని శ్రీఏకనాథ స్వామి ఆలయ శిఖర జీర్ణోద్ధరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు సఖారాం శర్మ, సంతోష్ శర్మ, నరేష్ శర్మ, యోగేష్ శర్మ ఆధ్వర్యంలో పుణ్యాహవాచనం, సప్తమాతృక, నవగ్రహ, అష్టదిక్పాలక, ప్రధాన కలశ, మంటపదేవత హోమాధి కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో పాల్దే అనిల్, నడుకుడ పోశెట్టి, సంబు భోజారాం పటేల్, దనే నర్సయ్య, ధనే రవి, ఆనందం, సప్పల రవి, సబ్బని మురళి, శైలేశ్వర్, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మురేష్, పండరి, విజయ్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్

2

సోమవారం 21 ఆగస్టు 2023

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బేల



పేదరికంతో బాధపడుతూ పూటగడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద కుటుంబానికి నేనున్నానంటూ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆదివారం తనవంతు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. మండలంలోని అవల్‌పూర్ గ్రామానికి చెందిన బాస దాసు వ్యక్తి కడు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకొని, తానున్నానంటూ తన వంతు సాయంగా రూ. 5వేలు అందించారు. తన పేదరికాన్ని చూసి సాయం చేసిన ఆయనకు బాసదాసు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట నరేందర్, నాక్లే విఠల్, రాకేష్ ఉన్నారు.

మంత్రిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ముధోల్

హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నెట్టేసి చెంప దెబ్బ కొట్టడాన్ని ఖండిస్తున్నామని బంజారా సంఘం జిల్లా నాయకులు నరేందర్ రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. గౌరవ ప్రదమైన ప్రజా ప్రతినిధిని అవమానించడం సరికాదన్నారు. బంజారా సమాజాన్ని మంత్రి అవమానించారని పేర్కొన్నారు. అధిష్టానం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బంజారా సమాజం తగురీతీలో స్పందిస్తుందని బుద్ధి చేపడుతుందని హెచ్చరించారు.

ఆర్జీయూకేటీ విద్యార్థుల సమస్యలు తీరేనా..?



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు తీర్చి వారు విద్యాభ్యాసంపై దృష్టి సాధించేలా యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనపడటం లేదు. ప్రధానంగా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్, డైరెక్టర్ స్థానికంగా ఉంటూ విద్యార్థుల బాగోగులు చూసుకుంటే స్థానికంగా ఉన్న సమస్యలు వారి దృష్టికి వచ్చి పరిష్కరించే అవకాశముంటుంది. కానీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ హైదరాబాద్‌లో ఉంటూ పాలన సాగిస్తుండటం, డైరెక్టర్ తన పనులలో బిజీగా ఉంటూ విద్యార్థులతో కలవక పోవడంతో సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యపడటం లేదు. దీంతో విద్యార్థులకు ఉన్నత అధికారులతో మెరుగైన సంబంధాలు లేక పోవడంతోనే సమస్యలను తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని యూనివర్సిటీ విద్యార్థుల పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు తమ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే స్థానిక అధికారులు పెద్ద అడ్డంకిగా ఉన్నారని ఇంజనీరింగ్ విద్యార్థులు భావిస్తున్నారు. దీంతో ఒక్క సంవత్సర కాలంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం విద్యార్థుల్లో అభద్రతాభావాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సంవత్సరం సమస్యల పరిష్కారానికి కోసం విద్యార్థులు వారం రోజుల పాటు ఉద్యమం చేశారు. సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ యూనివర్సిటీని సందర్శిస్తే తప్ప తమ సమస్యలు పరిష్కారం కావని విద్యార్థులు మొండికేయడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనివర్సిటీని మంత్రి కేటీఆర్ సందర్శిస్తారని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. గత సంవత్సరం యూనివర్సిటీని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సందర్శించి సమస్యలు పరిష్కారిస్తామని, మెస్‌లను తొలగిస్తామని, విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందిస్తామని, విద్యార్థులు విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం మరో 1500 మంది విద్యార్థులు యూనివర్సిటీలో అడుగు పెట్టారు. అప్పటి నుండి ఉన్న పాత మెస్‌లను యూనివర్సిటీ అధికారులు ఇప్పటి వరకు తొలగించలేదు, మెస్‌ల సంఖ్యను పెంచలేదు. నూతనంగా మెస్ టెండర్లను పిలిచిన దాఖలాలు లేవు. దీంతోపాటు విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులను భర్తీ చేయాలని కోరిన ఇప్పటివరకు ఎలాంటి ప్రక్రియ ప్రారంభించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి పాటు యూనివర్సిటీలో తొమ్మిది వేల మంది విద్యార్థులకు క్రీడలకు సంబంధించి 10 మంది సిబ్బంది ఉన్నట్టు తెలుస్తుంది. నూతనంగా వచ్చిన విద్యార్థులకు లాప్‌టాప్, యూనిఫామ్ అందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీలో ఆంక్షల పేరిట విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పాత మెస్ యాజమాన్యలపై ఎందుకంత ప్రేమో..

యూనివర్సిటీలో ప్రధానంగా విద్యార్థులు పౌష్టికాహారం అందడం లేదని, గత సంవత్సరం ఆందోళన చేశారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. యూనివర్సిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పౌష్టికాహారం అందించని మెస్‌లను తొలగించాలని మంత్రి ఆదేశించిన ఇప్పటి వరకు ఆ మెస్ యాజమాన్యాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంవత్సర కాలం గడుస్తున్న ఇప్పటివరకు మెస్ నూతన టెండర్లను అధికారులు పిలవలేదు. వారికే మెస్ బాధ్యతలను కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి ఎందుకు కేటాయిస్తున్నారో తెలియడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ అధికారులు మెస్ యాజమాన్యాల మధ్య ఏదైనా సత్ససంబంధాలు ఉన్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సాక్షాత్తు ఐటీ శాఖ మంత్రి ఆదేశించిన ఆ మెస్ యాజమాన్యాలపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారో అర్థం కావడం లేదని, కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల వాపోయారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్ కరువు...

నూతనంగా యూనివర్సిటీలో విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించే ఆనవాయితీని అధికారులు పెడచెవిన పెట్టారు. అవగాహన సదస్సును తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బందితో విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అదేమీ పట్టనట్లు యూనివర్సిటీ అధికారులు వ్యవహరించారు. యూనివర్సిటీలో నలుగురు వైద్యులతో ఉన్న ఆస్పత్రి అలంకార ప్రాయంగానే మారింది. యూనివర్సిటీలోని ఆస్పత్రి ప్రాథమిక చికిత్సలకే పరిమితం అవుతుంది. మేజర్ ప్రమాదాలు జరిగితే నవీపేట్, నిర్మల్ జిల్లా ఆస్పత్రులను తరలిస్తున్నారు. వైద్య సిబ్బంది వారంలో ఒక రోజు నూతన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తే వారిలో ఉన్న భయాలు తొలగిపోయే అవకాశం ఉంటుంది.

యూనివర్సిటీలో అధ్యాపకుల భర్తీకి మోగ్గు చూపని అధికారులు

యూనివర్సిటీలో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకుల భర్తీకి యూనివర్సిటీ అధికారులు మొగ్గు చూపడం లేదు. దీంతో ఒక్కో తరగతిలో 70 నుంచి 100 మంది విద్యార్థులకు విద్యాబోధన కొనసాగుతుంది. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులను భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ తరపున యూనివర్సిటీ అధికారులకు వివరించినప్పటికీ అధ్యాపకులను ఇప్పటికీ భర్తీ చేయలేదు. దీంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై అధిక ప్రభావం చూపుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా యూనివర్సిటీలోకి మీడియాకు అనుమతి లేదు. లోపల ఏం జరుగుతుందో సమస్యలు ఎంటనేది బయటకు రావడం లేదు. ఇంకో విద్యార్థి ప్రాణంగాల్లో కలవక ముందే యూనివర్సిటీ యంత్రంగం అలర్ట్ అవుతుందో లేదో వేచిచూడాలి.



బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కాంగ్రెస్, బీజేపీ పాలనలో ప్రజా సంక్షేమానికి చేసిందేమి లేదని, తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేండ్ల అనతికాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు విశేష ప్రజాదరణ ఉందని ఎమ్మెల్యే జోగురామన్న స్పష్టం చేశారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆటో యూనియన్, నాయక్ పోడ్ సంఘాల ప్రతినిధులతో పాటు గ్రామస్తులు పార్టీలో చేరారు. అంతకుముందు ఆటో స్టాండ్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని అన్నారు. గతంలో అంకోలి గ్రామానికి రావాలంటే సరైన మార్గం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసే స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలోకి చేరేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, గతంలో పాలించిన కాంగ్రెస్ సైతం బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, సర్పంచ్ భూమన్న, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్, మేస్రం పరమేశ్వర్, సెవ్వ జగదీష్, కనక రమణ, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు గంగయ్య యాదవ్, మడావి కిషన్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం..

- ఐకేపీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం
- సొంత భవనం లేక ఇబ్బందులు

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని ఐకేపీ భవనంలోకి మార్చారు. ఎండ్లు గడుస్తున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించకపోవడంతో అది ఐకేపీ భవనంలోనే కొనసాగుతుంది. అనునిత్యం వివిధ సమస్యలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఐకేపీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయంలో చిన్న గదిలో ఉండటంతో అది సరిపోకపోవడంతో ప్రజలు సరియైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నవతెలంగాణ-తలమడుగు

ఐకేపీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం...

తహసీల్దార్ కార్యాలయ సొంత భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని ఐకేపీ భవనంలోకి మార్చారు. ఐకేపీ భవనంలో తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఒకే భవనంలో రెండు కార్యాలయాలు కొనసాగడంతో ఇరు కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, కనీస సౌకార్యలు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా కార్యాలయ సిబ్బందికి సైతం విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని తహసీల్దార్ కార్యాలయం...

శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం మరమ్మతులకు నోచుకోవడం లేదు. అప్పటి కలెక్టర్ దివ్యదేవరాజన్ మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరు చేసినప్పటికీ అవి సరిపోవనే కారణంగా ఆ నిధులను ఐకేపీ భవనంలో తహసీల్దార్ గది ఏర్పాటుకే ఖర్చు చేశారు. దీంతో సొంత భవనం మరమ్మతులకు లేక పెచ్చులు ఊడిపోతూ పూర్తిగా భవనం వినియోగంలోకి లేకుండా పోతోంది.గతంలో కలెక్టర్ ఎమ్మెల్యేకు తాసిల్దార్ కార్యాలయం నిర్మాణం గురించి విన్నవించినప్పటికీ భవన నిర్మాణం నోచుకోకపోవడంతో ఐకెపి కార్యాలయ%శీ%లో చాలీచాలని గదులలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కుల ఆదాయ పహానీలు ధరణి వివిధ పనులపై వచ్చిన దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఐకెపి కార్యాలయంలో తాసిల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నప్పటికీ ఇటు రెవెన్యూ ఐకెపి సిబ్బందికి కూడా స్థలం సరిపోకపోవడంతో రెండు శాఖల అధికారులు తక్కువ స్థలంలోనే విధులు నిర్వ ఇంచాల్సి వస్తుంది. గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్ దివ్య రాజన్ మరమత్తుల కోసం ఐదు లక్షలు మంజూరు చేసినప్పటికీ సరిపోవనే ఉద్దేశంతో ఆ నిధుల నుండి తాసిల్దార్ ప్రత్యేక గది కోసం ఐకెపి కార్యాలయంలో అడ్డంగా ప్లై వుడ్ ఆ మార్చడం జరిగింది. వివిధ గ్రామాల నుండి వివిధ పనులపై వచ్చిన దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే చరవ చూపి మండల తాసిల్దార్ కార్యాలయం కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జైనథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అధ్యాపక సంఘ యూనియన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ పట్టణానికి 40 కిలోమీటర్ల వరకు ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వలన బేల, జైనథ్ మండల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం జైనథ్ మండలంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరినట్లు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తప్పకుండా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఉన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా స్థానిక డైట్ కళాశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా సెక్టోరల్ అధికారి జె నారాయణ పాల్గొని మాట్లాడారు. మన రాష్ట్రంలో మూఢనమ్మకాలు పెరిగిపోతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలని అన్నారు. డాక్టర్ నరేంద్ర దొబ్బెల్కర్ వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ శాస్త్రీయ దృక్పథం దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. మహారాష్ట్రలో మూఢనమ్మకాల నిరోధక చట్టం కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకొని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ శాఖ మూఢనమ్మకాల నిరోధక చట్టం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి, కోశాధికారి శ్రీధర్‌బాబు ఉపాధ్యక్షులు గంగన్న, ఉమాకాంత్, వేముల నాగరాజు, రంజిత్‌రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మెన్ ప్రకాష్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాశ్రమానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం

నవాబ్‌పేట్ గ్రామంలో సత్యం ట్రెడిషనల్ మెడిసినల్ ట్రీట్మెంట్ యోగాశ్రమానికి డాక్టర్ సత్యం రాపెల్లి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నుంచి ట్రిబల్ మినిస్టర్ ఉత్తమ్ రగోజీ రావు ఇంగ్లే, హైదరాబాద్‌కు చెందిన మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు దుర్గేందర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, పెంబి జడ్పీటీసీ జానుభాయి, రమేష్, కడెం ఎస్సై కొసన రాజు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య ప్రముఖ అడ్వకేట్ వెంకట్ మహేంద్ర, నవాబ్ పేట్ సర్పంచ్ విజయ రాజన్న, ఉపసర్పంచ్ రాజేష్, వార్డ్ మెంబర్ జక్కుల శ్రీను, నవాబ్ పేట్ యూత్ సభ్యులు, గ్రామస్తులు హాజరయ్యారు.

అన్నాభావు సాఠే జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 28న నిర్వహించే అన్నాభావు సాఠే జయంతిని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సంఘం జిల్లా నాయకుడు కాంబ్లె బాలరాజ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ భవన్‌లో జయంతికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 28న ఇంద్రవెల్లి మండలంలో అన్నాభావు సాఠే జయంతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు ప్రముఖ గురువు సద్గురు గజానంద్ మావుళి, జెడ్పీచైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే రేఖా నాయక్‌లు హాజరవుతున్నారని అన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాందాస్, ఆనంద్‌రావు, మహాదేవ్, గంగాధర్, నగేష్, జనార్ధన్, అరుణ్, సంజీవ్, సునీల్ ఉన్నారు.

గద్దర్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-బోథ్



తెలంగాణ ఉద్యమంలో గద్దర్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శాదీఖానలో ఆదివారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గద్దర్ చేసిన సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమంలో ఆయన కృషిని తెలంగాణ సమాజం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. అందరివాడిగా ఆయన ప్రయాణాన్ని, రేపటి తరానికి దారులుగా చూపెట్టాలని అన్నారు. గద్దర్ భౌతికంగా లేకపోయినా ఆయన పాట ద్వారా మనలో ఒకడిగా ఎప్పుడు ఉద్యమ స్ఫూర్తిని నింపుతూనే ఉంటాడని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పసుల చంటి, అబుద్, ఉపాధ్యాయులు, ఆర్‌టీపీ ప్రసాద్, గోవర్ధన్, రావుల శంకర్, మేధావులు, వివిధ ప్రజాసంఘ నాయకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

సాత్నాల మండలం ఏర్పాటుతో హర్షం

- ఎమ్మెల్యేను సన్మానించిన సాధన సమితి నాయకులు



నవతెలంగాణ-జైనథ్

సాత్నాల మండలం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సాత్నాల సాధన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్నను సన్మానించారు. మండలం ఏర్పాటుతో సాత్నాల వైపు వివిధ గ్రామాల ప్రజలకు పరిపాలన సులభతరంగా మారుతుందని తెలిపారు. ఇన్నాండ్లు పడిన ప్రయాణ బాధలు తప్పుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు బోనగిరి సంటెన్న, అడప తిరుపతి, గద్దల శంకర్, కంటం వేణుగోపాల్, అడప నారాయణ, పడాల దయాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ మరణానంతరం భారత ప్రధానిగా ఉండి యువతను రాజకీయాలలో భాగస్వామం చేయడానికి 21 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలకు కుదించి 1986లో కొత్త విద్య విధానాన్ని తీసుకువచ్చి ప్రతి పేదవాడికి విద్యను అందించిన మహానియుడు అన్నారు. మన దేశంలో సాంకేతిక పరిజ్ఞానం ఇంత అభివృద్ధి చెందిందంటే ఆయన కృషి ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు బాపురావు హూల్కే, వామన్, విఠల్‌రావు, మడావి చంద్రకాంత్ పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 79వ జయింతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సల్ల రవి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ దేశానికి సాంకేతికతను పరిచయం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల అధికార ప్రతినిధి అబ్రార్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ రహిముద్దీన్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు బత్తుల రమేష్, సీనియర్ నాయకులు గుడాల శేఖర్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఆసిఫ్, సలీం శంకర్ కాంగ్రెస్ పార్టీ పాల్గొన్నారు.

నిర్మల్ : దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ హయాంలోనే దేశం అభివృద్ధి సాధించిందన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం ఆయన ప్రవేశపెట్టిన పలు పథకాలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా ప్రవేశపెట్టిన అనేక సంస్కరణల దేశభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, నాయకులు కాదర్ల గంగ నర్సయ్య, జహీర్ అహ్మద్, సలీం ఖాన్, నేత శ్యామ్, రవి, షౌకత్ పాషా, మైస శ్రీనివాస్, సయ్యద్ ఆయుబ్, ఫైముద్, అరిఫ్ పాల్గొన్నారు.

కడెం : కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం జవహర్ రోజ్‌గార్ యోజన లాంటి మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధిలో బాటలో నడిపించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు షేక్ రఫీక్, పడగల భూషణ్, చాంద్‌పాషా, బ్రహ్మచారి, టి.ధర్మయ్య, సంసోను నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలో గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రధానిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. రాబోయే రోజుల్లో దేశంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యూసుఫ్ ఖాన్, కరీంఖాన్, దేవ్‌రావ్ లోఖండే, షేక్ సత్తార్, కైలాష్, దేవిదాస్, షేక్ నసీర్, ఆడే ప్రకాష్, డిగాంబర్, జాకురుల్లా, నిజాం, ఉత్తం, సుందర్ లాల్, మోతిరాం, సలీం, సంతోష్ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 21 ఆగస్టు 2023

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి వేడుకలు

నవతెలంగాణ-సిరికొండ



అన్నాభావు సాఠే 103వ జయంతి వేడుకలు మండలంలోని రాంపూర్ (బి) గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జెండావిష్కరణ చేశారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన యోధుడని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పలువురు నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక బాయి, ఉపసర్పంచ్ ప్రహ్లాద్, నాయకులు బాలాజీ, సంజీవ్, శివాజీ, సదాశివ్, గంగాధర్, మారుతి పాల్గొన్నారు.

పాదయాత్రలో జనసైనికులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



'జనంలోకి జనసేన కార్యకర్తలు' కార్యక్రమంలో భాగంగా హైదరాబాదులోని బాలానగర్ 120 డివిజన్‌లో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి నేమూరి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాదయాత్రలో సిర్పూర్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. పార్టీ ఆశయాలను జనాలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లూరి సాయికుమార్, తౌటీ ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

- చింతగూడ గ్రామంలో విషాదఛాయలు

నవతెలంగాణ-జన్నారం



పురుగుల మందు తాగి బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జన్నారం మండలంలోని చింతగూడాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం చింతగూడ గ్రామానికి చెందిన బాణావత్ సురేష్(35) వాంకిడి మండలంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదిన వాంకిడి మండల కేంద్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రియాంక, కుమారుడు విరాన్స్ ఉన్నారు. చింతగూడ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని గడ్చిరోలీ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే దేవ్రావ్ హోళీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దీనికోసం పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఎనిమిది రోజులపాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ అజ్మీర అత్మరామ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నక్ విజయ్, తాలుక కన్వీనర్ సొల్లు లక్ష్మీ, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్ పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గంలో ముగ్గురికి చోటు

నవతెలంగాణ-జన్నారం



మోకుదెబ్బ జిల్లా నూతన కార్యవర్గంలో ముగ్గురు మండలవాసులకు చోటు లభించిందని ఆ సంఘం జాతీయ నాయకుడు అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర నాయకుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా మోకు దెబ్బ కార్యవర్గ ఎన్నికలలో మండలానికి చెందిన ఓల్లాల నర్సాగౌడ్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, పోడేటి శ్రీనివాస్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పోడేటి సత్యగౌడ్ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియామకం అయ్యారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఫథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బెంగళూరు ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్



నవతెలంగాణ-చెన్నూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెల్లాలని బెంగుళూరు బీజేపీ ఎమ్మెల్యే కేశవ్ ప్రసాద్ పార్టీ నాయకులకు సూచించారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశం అత్యంత శక్తివంతంగా ఎదిగిందని, రష్యా యుద్ధ సమయంలో ఐదు గంటల పాటు యుద్ధాన్ని ఆపించి మన విద్యార్థులను క్షేమంగా తీసుకువచ్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక కమిటీలపై పూర్తిస్థాయి నివేదిక తీసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్, మాజీ ఎమ్మెల్యే సోత్కు సంజీవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, జిల్లా కార్యదర్శి రఘునందన్, సీనియర్ నాయకులు ఆర్మూర్ల పోషం, డీవీ దీక్షితులు, పట్టణ అధ్యక్షుడు శుద్ధపల్లి సుశీల్ కుమార్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమ్మెకు సంఘీభావం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న రెండవ ఏఎన్ఎంల సమ్మెకు మిషన్ భగీరథ కార్మిక సంఘం(సీఐటీయూ) నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా రెండవ ఏఎన్ఎంలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్ఎంలను తొలగించే విధంగా ప్రస్తుతం వేసిన నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్ఎంలు వైద్య రంగంలో కేంద్ర, రాష్ట్ర స్కీములను అమలు చేయడంలో ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో వారు చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అండగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఓదెలు, జిల్లా కార్యదర్శి రాజేందర్, మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మికులు దుర్గం లింగయ్య, బాలేష్, మధుకర్, శుభం, మునీశ్వర్, ప్రకాష్, శ్రీకాంత్, బుడ్డయ్య, రాజు, రాజేష్, ఈశ్వర్, గోకుల్, రమేష్, నగేష్, అనిల్, గౌతమ్, అమృత్, భీమ్‌రాజ్ , రెండవ ఏఎన్ఎంల సంఘం అధ్యక్షురాలు సంతోషి పాల్గొన్నారు.

'కార్మికుల పక్షాన పోరాడే సంఘం ఏఐటీయూసీ'



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఎల్లవేళలా కార్మికుల పక్షాన పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం సీసీసీలోని నర్సయ్య భవన్‌లో బ్రాంచ్ 12వ మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆగస్టు 25,26,27 16వ రాష్ట్ర మహాసభలను గోదావరిఖనిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి మూడున్నర సంవత్సరాలకు ఒకసారి ఈ మహాసభలను నిర్వహించుకుంటామని, కానీ కరోనా, సింగరేణి ఎలక్షన్లను దృష్టిలో ఉంచుకొని వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలు తర్వాత ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మాసభలకు కార్మిక వర్గం అంత పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చిస్తామని, సీఎం హామీ మేరకు కొత్త బొగ్గు గనులు తెరవాలని, 44 లేబర్ చట్టాలను నాలుగు కోట్లుగా మార్చడానికి వ్యతిరేకించడం, భవిష్యత్తులో సింగరేణి మనుగడ గురించి చర్చిస్తామని పేర్కొన్నారు. సింగరేణిలో రూ.వేలకోట్ల లాభాలు వస్తున్నాయని తెలిపి, కార్మికుల జీతాల కోసం బ్యాంకుల చుట్టూ సంస్థ తిరుగుతుందని ఆరోపించారు. బొగ్గు వెలికితీత పర్మనెంట్ ఉద్యోగులతోనే తీయాలని అగ్రిమెంట్ ఉందని, కానీ ప్రస్తుతం బొగ్గును ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికులు కూడా తీస్తున్నారని, ఇది అగ్రిమెంటుకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. సింగరేణిలో పూర్తిగా రాజకీయ జోక్యం ఉందని, ఇప్పటివరకు టీబీజీకేఎస్ కార్మికుల కోసం కనీసం రెండు అగ్రిమెంట్లను కూడా చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు రాజ్ కుమార్, వైవీ రావు, బాజీ సైదా, వీరభద్రయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు కలవేని శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కేంద్ర కార్యదర్శి మస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శిలు కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమరయ్య, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-జన్నారం



సెప్టెంబర్ 3న హైదరాబాదులో పద్మశాలి సంఘరం ఆధ్వర్యంలో నిర్వహించే శంఖారావసభ పోస్టర్లను ఆ సంఘ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా మరింత ఎదగాలని, కలిసికట్టుగా సమాజం కోసం ఉద్యమించాలని పద్మశాలి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్తంగా సెప్టెంబర్ 3వ తేదీన సరూర్‌నగర్ స్టేడియం, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పద్మశాలి రాజకీయ శంఖారావ, సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగినప్పుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల పైచిలుకు పద్మశాలీలు ఉన్నారని కానీ వారంతా అన్ని రకాలుగా అణచివేతకు గురవుతున్నారని అన్నారు. పద్మశాలీల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి అందరు చైతన్యవంతులై కదం తొక్కాల్సిన అవసరం ఉందన్నారు. మన ఓటు మన సీటు, మన వాటా ప్రకారం పద్మశాలీలకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని వివిధ పార్టీలకు అల్టీమేటం జారీ చేయనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సూచించారు. పద్మశాలి సమాజం కోసం ఉద్యమించిన కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పద్మశాలీలకు, చేనేత కార్మికులకు ప్రభుత్వ తరపున రావల్సిన సంక్షేమ పథకాలను వెంటనే అందివ్వాలని డిమాండ్ చేసారు. చేనేత రంగానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలనే డిమాండ్‌ని పొందుపరచనున్నట్లు తెలిపారు. పద్మశాలీలు కుటుంబానికి ఒక్కరి చొప్పున సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు గడ్డం సుధాకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిలువేరు సదానందం, మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి గంగయ్య, మంచాల సారంగపాణి, దశరథం, అయ్యోరి వీరయ్య, వాసాల రాజేశం, దోమల భాస్కర్, గాజర్ల రాజన్న, చెట్టిపెల్లి కృష్ణ , లచ్చన్న పాల్గొన్నారు.

భారతదేశ సాంకేతిక అభివృద్ధికి ఆధ్యుడు రాజీవ్ గాంధీ



నవతెలంగాణ-జన్నారం

మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ భార తదేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన మహా నాయకుడని కొనియాడారు. ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పిస్తూ యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా చేసిన సంస్కరణ కర్త రాజీవ్ గాంధీ అని అన్నారు. విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన వ్యక్తి అన్నారు. ఆయన ప్రతి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ పసివుల్లా, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అజ్మీర నందు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న పట్టణ అధ్యక్షుడు దుమల రమేష్, రేండ్లగూడ ఎంపీటీసీ కరుణాకర్, బినవేని రాజన్న, బోడ రవి నాయక్ పాల్గొన్నారు.

భీమారం : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు కోట రవి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో నిర్వహించిన వేడుకలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 40 ఎండ్ల వయసులోనే భారత దేశానికి 6వ ప్రధానిగా పదవి భాద్యతులు చేపట్టారని తెలిపారు. అతి పిన్న వయస్సులో తీవ్రవాదులు చేసిన మానవ బాంబు దాడిలో మరణించాడని, ఇదే రోజు ఆయన వర్ధంతి రోజైన మే 21 నాడు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ దేశ సేవ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప మహానుబావుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీరాములు, అడకట్ల తిరుపతి, అరకాల రమేశ్, సెగ్యం తిరుపతి, దుర్గం శేశాద్రి, లింగన్న, కోట రమేశ్, పోలవేణి మల్లేష్ పాల్గొన్నారు.



డబ్బులు ఇప్పిస్తాం.. ఖర్చు అవుద్ది..!

నవతెలంగాణ-హాజీపూర్

మేము మీకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం పోరాడుతున్నామని త్వరలో డబ్బులు ఇప్పిస్తామని కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ వద్దకు వచ్చారని ఎల్లంపల్లి నిర్వాసితులు తెలిపారు. ఎల్లంపల్లి ముంపు గ్రామాల్లో పేరున్న రెండు జాతీయ ప్రతిపక్ష పార్టీల చోటా నాయకులు కొత్తగా డబ్బులు అడుగుతున్నారని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ ప్యాకేజీ కింద రూ.70 వేలు రావాల్సి ఉంది. గతంలో 3800 మంది వరకు ఈ ప్యాకేజీ వచ్చింది. ఇంకా సుమారు వెయ్యి మంది వరకు రావాల్సి ఉంది. ఇది ఎన్నికల సమయం కాబట్టి ప్రభుత్వం ఇచ్చేందుకు సుముఖంగా ఉందని దీనికోసం ఇప్పటికే ఎమ్మెల్యే వీరి లిస్టను ప్రభుత్వానికి పంపించారంటు పేర్కొంటున్నారు. అవి ఎన్నికల లోపే వచ్చే అవకాశం ఉందని దీన్ని అదునుగా భావించిన ప్రతిపక్షాలు నిర్వాసిత గ్రామాల్లో బాధితుల నుండి ఆధార్, పాన్ కార్డులు సేకరిస్తూ ఖర్చుల కోసం తలో రూ.వెయ్యి ఇవ్వాలని నిర్వాసితులకు ఫోన్లు చేస్తూ వసూలుకు పాల్పడుతున్నారు. కొందరు అమాయక నిర్వాసితులు వారికి డబ్బులు ఇస్తున్నారని తెలిసింది. వాస్తవానికి ఇంటి నిర్మాణ ప్యాకేజీ కింద రూ.70 వేలు పరిహారం రావాల్సిన వారి వివరాలు ఇప్పటికే కలెక్టరేట్‌లోని సంబంధిత సెక్షన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రజలు ఇలాంటి వసూళ్లకు పాల్పడే వారిని నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేయాలి



నవతెలంగాణ-తాండూర్

భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యకర్తలంతా సమిష్టి కృషితో పనిచేసి బెల్లంపల్లిలో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే భగీరథ మురుల్యా పిలుపునిచ్చారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యే ప్రవాస్ యోజన పర్యటనలో భాగంగా ఆదివారం బెల్లంపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో కిందిస్థాయి నుండి వచ్చిన కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందనితెలిపారు. బీజేపీ గెలుపుకు అందరూ కలిసి పనిచేయాలని కార్యకర్తలను కోరారు. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని నరేంద్ర మోడీ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆమురాజుల శ్రీదేవి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ,జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, జాయింట్ కన్వీనర్ రాజు లాల్ యాదవ్, జిల్లా కార్యదర్శిలు కే.గోవర్ధన్, మాసు రజిని, కౌన్సిలర్ అనిత యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-చింతాలమానెపల్లి

మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో గోపాల్(35) అనే వ్యక్తి పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత సంవత్సరం దుబాయ్ దేశానికి వెళ్లి వచ్చారు. తన సొంత గ్రామమైన రుద్రపూర్‌లో వ్యవసాయం చేసుకుంటున్నాడు. అప్పుల బాధతో శుక్రవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి ఈస్గం ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం అందించేందుకు మంచిర్యాల తీసుకెళ్లే క్రమంలో ఆదివారం మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య ఈశ్వరి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్‌గా మండల వాసి ఎంపిక



నవతెలంగాణ-కౌటాల

బీఎస్ఎఫ్ జవాన్‌గా మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన ఉపాసె అశోక్ ఎంపిక కావడంతో మండలవాసులు ఆయనను అభినందించారు. అశోక్ తల్లిదండ్రులు కమల-బాబాజీ వీరికి ఇద్దరు కుమారులు అశోక్ విద్యభ్యాసం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు పూర్తిచేసి, ఇంటర్, డిగ్రీ కాగజ్‌నగర్ పట్టణకేంద్రంలోని వసుంధర కళాశాలలో పూర్తిశాడు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ దరఖాస్తు చేసుకొని ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఆయన ఎంపికయ్యాడు. అశోక్‌ను నాగపెల్లి సర్పంచ్ వశాకె నిహారిక జ్యోతిరావు శాలువాతో సన్మానించారు.

రైతులు ఏఈఓలకు సమాచారం ఇవ్వాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని రైతులు అకారణంగా నిలిచిపోయిన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, అలాగే రైతుబీమా ద్వారా లబ్ధిపొందే కుటుంబసభ్యుల వివరాలను అయా గ్రామాల క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు అందజేయాలని ఏఓ మధులత అన్నారు. ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ శాఖ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మూర్ఛ వ్యాధితో చిన్నారి మృతి

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండల కేంద్రానికి చెందిన లోంకడే వాగయ్య కవిత దంపతులు చిన్న కుమార్తె ప్రియదర్శిని మూర్చ వ్యాధితో శనివారం రాత్రి మృతి చెందింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గత 15 రోజుల క్రితంలో ఒక్కసారి మూర్చ వ్యాధితో రావడంతో కుటుంబికులు మంచిర్యాలకు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అప్పటి నుంచి మళ్లీ శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా చిన్నారికి మూర్చ వ్యాధి రావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందినట్లు తెలిపారు. అల్లారుముద్దుగా చూసుకుంటున్న చిన్నారి చేతుల మీదుగా చనిపోవడంతో కుటుంబికుల రోదనలు మిన్నంటాయి.